Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 359 మేడ్చల్ మల్కాజ్‌గిరి 18 జనవరి 2024 గురువారం పేజీలు : 4

## 19న కర్ణాటకలో ప్రధాని మోదీ పర్యటన

బెంగళూరు : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 19న రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. బెంగళూరులో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ స్పెషాలిటీ ఇండియా, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రధాని లాంఛనంగా ప్రారంభించను న్నారు. ఇది అధికారి క కార్యక్రమమైనప్పటికీ ప్రధాని, రాష్ట్ర బీజేపీ నేతలతోనూ ప్రత్యేకంగా సమావేశమయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రధాని పర్యటనలో భాగంగా రోడ్‌షోను ఏర్పాటు చేయాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు. కాగా ప్రధాని పర్యటన నేపథ్యంలో ఈనెల 19న జరగాల్సిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని వాయిదా వేసినట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర బెంగళూరులో మీడియాకు చెప్పారు.




# అన్నదాతలకు శుభవార్త

## రైతు బంధు నిధుల విడుదలకు సన్నాహాలు

## నేటి నుంచే అకౌంట్లలోకి డబ్బులు

నిజామాబాద్ : తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు నిధులు విడుదల చేసేందుకు సన్నాహాలను ప్రారంభించింది. ఈ మేరకు కీలక వివరాలను సేకరించడంతోపాటు.. ఒకేసారి నిధుల విడుదల కోసం కసరత్తులను ప్రారంభించింది. ఈ క్రమంలో రైవంత్ సర్కార్.. రైతు బంధు నగదు విడుదలపై కీలక అప్డేట్ వచ్చింది. ఈ నెలాఖరులోగా రాష్ట్ర రైతుల ఖాతాల్లోకి రైతుబంధు నగదు జమవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన తుమ్మల నాగేశ్వరరావు.. రైతు బంధు నిధుల విడుదలపై మాట్లాడారు. నందమూరి తారక రామారావు స్ఫూర్తితో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఆంధ్రానగర్ లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసిన మంత్రి తుమ్మల.. నిజామాబాద్ జిల్లా వ్యవసాయానికి పెట్టింది పేరంటూ పేర్కొన్నారు. ఎన్టీఆర్ నేటికీ తన ఆదర్శ నాయకుడంటూ మంత్రి పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ఎన్టీఆర్ ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చారంటూ పేర్కొన్నారు. ఈ సందర్భంగా.. రైతుబంధుతోపాటు.. రుణమాఫీపై కూడా తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. రెండు లక్షల రైతుల రుణమాఫీని దశలవారీగా రైతు ఖాతాల్లోకి జమ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోందని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సరే, రైతు డిక్లరేషన్ ను అమలు చేసి తీరుతామని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇప్పటికే రెండెకరాల లోపు వ్యవసాయ భూమి కలిగిన 29 లక్షల మంది రైతులకు రైతు బంధు అందించామని, మిగతా రైతులకు కూడా రేపటి నుంచి వారి ఖాతాల్లో రైతు బంధు డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ నెలాఖరు లోపు రైతులందరి ఖాతాల్లో రైతు బంధు నిధులు పడతాయన్నారు.. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తామని అన్నారు. రైతాంగ అవసరాలు, కష్టాలు తెలిసిన వ్యక్తిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు నెలకొని ఉన్నప్పటికీ రైతాంగ ప్రయోజనాల విషయంలో ఎంతమాత్రం రాజీ పడబోమని, ఎన్నికల సమయంలో రైతాంగ డిక్లరేషన్ లో పొందుపర్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని మంత్రి భరోసా కల్పించారు. ఇప్పటికే రెండెకరాలలోపు వ్యవసాయ భూమి కలిగిన 29 లక్షల మంది రైతులకు రైతు బంధు అందించామని, మిగతా రైతులకు కూడా రేపటి నుంచి వారి ఖాతాల్లో రైతు బంధు డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ నెలాఖరు లోపు రైతులందరి ఖాతాల్లో రైతు బంధు నిధులు పడతాయని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీని అమలు చేసే విషయంలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో పట్టుదలతో కృషి చేస్తున్నారని అన్నారు. యాసంగి సీజన్‌లో రైతుబంధు వేయడానికి రూ. 7,625 కోట్ల నిధులు అవసరం కాగా.. ఇప్పటివరకు ఎకరం లోపు పొలం ఉన్న 21 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రూ. 1,050 కోట్లు జమ చేసింది. మిగతా రైతులకు మనీ రావాల్సి ఉ ంది. మిగతా నిధుల కోసం కేంద్రాన్ని రూ. 13,500 కోట్ల రుణం తీసుకునేందుకు అనుమతి కోరగా.. కేంద్రం రూ. 9 వేల కోట్ల రుణం తీసుకోవడానికి అనుమతి ఇచ్చింది. వాటిలో 2 వేల కోట్లు ఈనెల వచ్చే అవకాశం ఉందని తెలిసింది. ఈ రుణం నుంచి కొంత రైతుబంధు పథకం కింద రైతులకు జమ చేసే అవకాశాలు ఉన్నాయి.

## ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసిన ఏఐసీసీ..

### అభ్యర్థులుగా బల్మూరి వెంకట్, మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్: ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేసే ఇద్దరు అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌లను ఎంపిక చేసినట్లు బుధవారం అధికారికంగా ప్రకటించారు. నామినేషన్లు దాఖలు చేయడానికి గురువారం(ఈ నెల 18) వరకూ గడువు ఉంది.


అద్దంకి దయాకర్‌తో పాటు బల్మూరి వెంకట్‌కు అవకాశం ఇచ్చినట్టు తొలుత ప్రచారం జరిగింది. కానీ, మహేశ్‌కుమార్ గౌడ్‌కు అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది.

ఎమ్మెల్యేల కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి విడివిడిగా నిర్వహించనున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సంఖ్యాబలం ఉన్నందువల్ల రెండు స్థానాలనూ గెలిచేందుకు అవకాశముంది.

**మెడిసిన్ చదివి రాజకీయాల్లోకి..** ఎంబీబీఎస్ చదివిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ గతంలో హుజూరాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు టికెట్ లభించలేదు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు చేపట్టి.. ఆయన పార్టీలో గుర్తింపు పొందారు. సీఎం, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా ఆయనకు పేరుంది.

# ఫండ్ పక్కదారి పట్టిందా...!?

## తెలంగాణ బీజేపీలో కొత్త రచ్చ.. హైకమాండ్ ఏం తేల్చబోతుంది?



హైదరాబాద్ : తెలంగాణపై బీజేపీ హైకమాండ్ ఫోకస్ పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల ఖర్చు లెక్కలపై ఆరా తీస్తోంది. ఎన్నికల సందర్భంగా వచ్చిన పార్టీ ఫండ్ దారితప్పిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై పలువురు బీజేపీ అభ్యర్థులు హస్తినకు ఫిర్యాదులు చేశారు. పార్టీ హైకమాండ్ ఇచ్చిన నిధులు కింది వరకు అందకపోవడంతో.. చాలా సెగ్మెంట్లలో పార్టీ ఓడిపోయిందని వారు అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లారట. రాష్ట్రానికి చెందిన పలువురు నేతల ఫిర్యాదు మేరకు నిధుల సంగతి తేల్చేందుకు తెలంగాణలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు చెందిన షాడో టీమ్ రంగంలోకి దిగిందని చెబుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను మూడు కేటగిరీలుగా విభజించి ఫండ్ కేటాయించిందని పలువురు అభ్యర్థులు చెబుతున్నారు. నియోజకవర్గాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారని వారు వెల్లడించారు. ఏ కేటగిరీ అంటే గెలిచేదిగా, బీ అంటే కొంచెం కష్టపడితే గెలిచేదిగా, సీ కేటగిరి అంటే గెలిచే ఛాన్స్ లేకపోయినా.. పార్టీ కార్యకర్తలను కాపాడుకోవడమే లక్ష్యం.

అయితే పార్టీకి ఏమాత్రం బలం లేని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు భారీగా నిధులు సమకూర్చారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అదే గెలుపునకు దగ్గరలో ఉన్నారనుకున్న సెగ్మెంట్లకు చాలా తక్కువ నిధులు కేటాయించడంతో ఓటమి పాలయ్యామని పలువురు పార్టీ అధిష్టానం ముందు ఆవేదన వ్యక్తం చేశారట. అభ్యర్థుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు అసలు..ఎవరికెంత ఇచ్చారనే దానిపై అమిత్ షా టీమ్ రంగంలోకి దిగిందని చెబుతున్నారు. ఈ వివరాలపై ఆరా తీస్తున్న హైకమాండ్ బృందానికి సర్దిచెప్పేందుకు రాష్ట్ర నాయకత్వం హైరానా పడుతోంది. తెలంగాణలో జరిగిన తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 8 నియోజకవర్గాల్లో విజయం సాధించింది. 19 సెగ్మెంట్లలో రెండో స్థానంలో నిలిచింది. అయితే రెండో స్థానంలో నిలిచిన చాలా సెగ్మెంట్లకు అధిష్టానం కేటాయించిన నిధుల్లో సగం మాత్రమే అందాయని, మిగతా సగం నిధులు దారి మళ్లాయని అభ్యర్థులు గగ్గోలు పెడుతున్నారు. ఆ స్థానాల్లో పార్టీ ఓటమికి నిధులు సక్రమంగా అందకపోవడమే కారణమని హైకమాండ్ కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తెలంగాణకు వచ్చిన అమిత్ షా టీమ్ ఇంకా ఏయే అంశాలపై ఆరా తీయనుందనేది అంతుచిక్కడం లేదు. ఈ వివరాలతో పాటు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన అంశాలపైనా దృష్టి కేంద్రీకరించనుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము ఎంతైనా ఖర్చు పెట్టేందుకు సిద్ధమేనని చెప్పిన ఆశావహులు టికెట్ వచ్చాక మాత్రం ఇలాంటి ఫిర్యాదులు చేయడంపైనా హైకమాండ్ దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. అమిత్ షా టీమ్ ఎలాంటి నివేదికను అధిష్టానానికి అందించనుందనేది ఆసక్తికరంగా మారింది. రాష్ట్రానికి వచ్చిన ఢిల్లీ టీమ్ ఇచ్చే నివేదికపై జాతీయ నాయకత్వం ఎలాంటి చర్యలు చేపడుతుందో చూడాలి.



# ఆ రోజులు ఎంతో దూరంలో లేవు

## రేవంత్ సర్కార్‌పై బాంబు పేల్చిన హరీష్ రావు

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిని అధిగమించిన భారత్ రాష్ట్ర సమితి.. లోక్‌సభ బరిపై దృష్టి పెట్టింది. అసెంబ్లీ బరిలో ఎదురైన పరాజయాన్ని ఇక్కడ పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలను తీసుకుంటోంది. లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో సమీక్షా సమావేశాలను నిర్వహిస్తోంది. తెలంగాణ భవన్‌లో నాగర్ కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన పార్టీ ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేసింది బీఆర్‌ఎస్. పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి టీ హరిష్ రావు దీనికి సారథ్యాన్ని వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వీ శ్రీనివాస్ గౌడ్,మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మధుసూధనాచారి, ఎంపీ పీ రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తల అభిప్రాయాల మేరకు పార్టీ అగ్రనాయకత్వం నడుచుకుంటుందని, వారి సూచనల మేరకే పని చేస్తుందని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం రేయింబవళ్లు పని చేసినప్పటికీ.. అసెంబ్లీ ఎన్నికల్లో తడబడాల్సి వచ్చిందని చెప్పారు. ప్రతి పక్షంలో కూర్చున్నందుకు అధైర్య పడాల్సిన అవసరం లేదని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడానికి బలమైన కారణాలు ఉండనక్కర్లేదని వ్యాఖ్యానించారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లల్లో కూడా అయిదేళ్లకే ప్రభుత్వం మారిందని గుర్తు చేశారు. ప్రభుత్వాలు మారడం కొత్తేమి కాదని అన్నారు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే ఏడాదికి 3.5 లక్షల కోట్ల రూపాయలు అవసరమౌతాయని, అంత బడ్జెట్ లేదని హరీష్ రావు అన్నారు. ఎలాగూ అధికారంలోకి రావట్లేదనే ఉద్దేశంతో బడ్జెట్‌కు మించిన హామీలను కాంగ్రెస్ నేతలు ఇచ్చారని, ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపేలా మేనిఫెస్టోను రూపొందించారని విమర్శించారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిందే తప్ప ప్రజా బలంతో కాదని హరీష్ రావు స్పష్టం చేశారు. హామీల గురించి డిమాండ్ చేస్తే అనవసర విషయాలు తెరపైకి తెస్తోన్నారని ఆరోపించారు. కర్ణాటకలో అయిదు గ్యారంటీల అమలుకు డబ్బులు లేవంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోందని, ఇక్కడా అదే పరిస్థితి వస్తుందని అన్నారు. కాంగ్రెస్ నేతలు గ్యారంటీల చావు గురించి వార్త చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని హరీష్ రావు తేల్చి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీలో ప్రతిరోజూ బీజేపీ నాయకుల మెడలకు దండలు వేస్తోన్నారంటూ ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిస్తేనే తెలంగాణ సమస్యలకి పరిష్కారం లభిస్తుందని వివరించారు. కాంగ్రెస్ బీజేపీల మైత్రి గుచించి బండి సంజయ్ బహిరంగంగా ఒప్పుకొన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదేనని బండి సంజయ్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి ప్రయత్నించి బీజేపీ బ్రోకర్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబట్టారని విమర్శించారు. దావోస్ వెళ్లడం అంటే ఖర్చు దండగ అంటూ ప్రతిపక్షంలో ఉండగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి అక్కడే పర్యటిస్తోన్నారని, దీనికి ఏమని బదులిస్తారని హరీష్ రావు నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా వంద రోజులు చేసుకోలేదనే ఉద్దేశంతోనే ఇంకా ఆగుతున్నామని.. లేకపోతే చీల్చి చెండాడే వాళ్లమని హెచ్చరించారు.

## సంపాదకీయం

# రాహుల్ కు ఏఎంకు.. పీఎంకు తేడా తెలీదా?

కాంగ్రెస్ కీలక నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి దివంగత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె తన తాజా పుస్తకంలో పేర్కొన్న వ్యాఖ్యలు ఇప్పుడు ఆసక్తికరంగా మారటమే కాదు.. కొత్త చర్చకు తెర తీసేలా మారాయి. తన తండ్రి.. సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో కీలక భూమిక పోషించిన దివంగత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తనతో చేసిన వ్యాఖ్యల్ని ఆయన కుమార్తె తాజా పుస్తకంలో పొందుపర్చారు. రాహుల్ వ్యక్తిత్వానికి సంబంధించిన ఈ వ్యాఖ్యలు.. ఆయన ఇమేజ్ ను కాస్తంత దెబ్బ తీసేలా ఉంటాయనటంలో సందేహం లేదు. ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ తాజాగా ఒక పుస్తకాన్ని రాశారు. 'ప్రణబ్ మై ఫాదర్.. ఏ డాటర్ రిమెంబర్స్' అన్న పేరుతో రాసిన పుస్తకంలో కొన్ని కీలకాంశాల్ని పొందుపర్చారు. ఈ పుస్తకంలో తన తండ్రితో జ్ఞాపకాలతో పాటు పలు అంశాల్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీలోనూ.. గాంధీ ఫ్యామిలీతోనూ ఆయనకున్న అనుభవాల్ని ప్రస్తావించారు. రాహుల్ గాంధీ నాయకత్వ లక్షణాలపై వెలిబుచ్చిన అనుమానాల్ని సైతం ఇందులో పేర్కొనటం గమనార్హం. అందుకు ఒక ఉదాహరణను ఆమె ప్రస్తావించారు. పుస్తకంలో ఆమె ఏమన్నారన్నది ఆమె మాటల్లోనే చూస్తే.. "ఒక రోజు ప్రణబ్ అలవాటు ప్రకారం రాష్ట్రపతి భవన్ లోని మొఘల్ గార్డెన్స్ లో మార్నింగ్ వాక్ చేస్తున్నారు. ఆయన్ను చూసేందుకు రాహుల్ వచ్చారు. మార్నింగ్ వాక్ చేసేటప్పుడు కానీ.. పూజా టైంలో కానీ ఎమైనా అవాంతరం వస్తే ఆయనకు ఇష్టం ఉండదు. అయినప్పటికి దాన్ని పట్టించుకోకుండా రాహుల్ ను కలిసేందుకు ఆయన నిర్ణయించుకున్నారు. అయితే.. ఆయన్ను రాహుల్ సాయంత్రం వేళలో కలవాల్సి ఉంది. కానీ.. రాహుల్ ఆఫీసు పొరపాటున ఇద్దరి మధ్య ఉదయం సమావేశం ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. ఈ విషయం ఒక అధికారి ద్వారా నాకు తెలిసింది. ఈ విషయం గురించి నాన్నను అడిగాను.. ఆయన వెంటనే ఒక మాట అన్నారు. "రాహుల్ కార్యాలయానికి ఏఎంకు పీఎంకు మధ్య తేడా తెలియకపోతే.. ఒకనాటికి వాళ్లు పీఎంవోను ఎలా నడపగలరు" అని అన్నట్లుగా శర్మిష్ఠ తన పుస్తకంలో పేర్కొన్నారు. రాహుల్ ను మంత్రివర్గంలో చేర్చటం ద్వారా ప్రభుత్వ వ్యవహారాల్లో అనుభవం సంపాదించుకోవాలని ప్రణబ్ సూచన చేశారన్న విషయాన్ని సైతం ఆమె తన పుస్తకంలో పేర్కొన్నారు. ఇదే పుస్తకంలో తన తండ్రి ప్రణబ్ ప్రధానమంత్రి పదవిపై ఉన్న ఆసక్తిని దాచుకోలేదు. ఈ సందర్భంగా సోనియా గాంధీ అనుసరించిన విధానాల్ని ఆమె ప్రస్తావించారు. 'ప్రధాని కావాలని ప్రణబ్ అనుకున్నారు. అయితే.. సోనియా తన కుటుంబ ప్రయోజనాల్ని పరిరక్షించుకోవటానికి మన్మోహన్ సింగ్ ను ప్రధానిని చేసేందుకు 2004లో మార్గం సుగమం చేశారు. సోనియా అధికారాన్ని తాను సవాలు చేసేవాడినా కాదా అన్నది ప్రశ్న కాదని.. తనకున్న అధికారాన్ని ఎవరూ ప్రశ్నించకూడదన్నట్లు సోనియా భావించారు. తన అధికారాన్ని ప్రశ్నించని వ్యక్తినే ప్రధానిని చేయటం ద్వారా తన సొంత.. కుటుంబ ప్రయోజనాల్ని సోనియా కాపాడుకున్నారు' అంటూ ప్రణబ్ కుమార్తె తన తాజా పుస్తకంలో పేర్కొన్నారు. చివరగా.. తాను రాసిన పుస్తకాన్ని బహుకరించేందుకు ఆమె ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి.. ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ తన తండ్రి ప్రణబ్ పై ఎప్పటిలాగే ఆదరాభిమానాన్ని చాటారని.. తన తండ్రి పట్ల ఆయనకున్న గౌరవం ఏ మాత్రం తగ్గలేదంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టి.. ప్రధాని మోడీతో కలిసిన ఫోటోల్ని షేర్ చేశారు.

# డబుల్ బెడ్రూమ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి అర్హులకు అందచేయాలి..

డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి...

డబుల్ బెడ్రూమ్లపై సమీక్ష సమావేశంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్.





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : జిల్లా వ్యాప్తంగా ఇంకా నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూమ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసిన అర్హులైన లబ్ధిదారులకు అందచేయాలని ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎమ్సీ) అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎన్ని డబుల్ బెడ్రూమ్లు అర్హులైన వారికి అందచేశారు...పనులు జరుగుతున్న డబుల్ బెడ్రూమ్ల పురోగతి ఎలా ఉంది... ఏఏ స్థితిలో ఉన్నాయనే వివరాలను ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాస మూర్తి, రెవెన్యూ డివిజన్ అధికారులు (ఆర్డీవోలు), సంబంధిత మండలాల అధికారులను అడిగి తెలుసుకొన్నారు. పెండింగ్లో ఉన్న డబుల్ బెడ్రూమ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ సమావేశంలో అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్రూమ్ నిర్మాణాలు పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందచేయాల్సిన అవసరం ఉందని... దీనిని దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలు, మండలాల వారీగా మంజూరైన లబ్ధిదారులకు అందచేయాల్సిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల విషయమై జీహెచ్ఎమ్సీ ఇంజినీర్లను కలెక్టర్ గౌతమ్ వివరాలను అడిగి తెలుసుకొన్నారు. దీనికి సంబంధిత జీహెచ్ఎంసీ ఇంజనీర్లు లబ్ధిదారుల మరణాలు (డెత్ కేసు), లబ్ధిదారుల ఫోన్ నెంబర్లతో నాట్ ట్రేసబుల్, రిజర్వేషన్ కల్పించిన వారికీ కులం (క్యాస్ట్) సర్టిఫికెట్ జారీ పెండింగ్లో ఉండటం వంటి కొన్ని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించి కలెక్టర్ గౌతమ్ డెత్ కేసులలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులను సంప్రదించి స్పౌస్ కానీ వారి పిల్లల్లో ఒకరి పేరును కుటుంబసభ్యులందరి సమక్షంలో నిర్ణయించి లిఖిత పూర్వకంగా ఆమోదపత్రం పొంది వారి పేరుపై డబుల్ బెడ్రూమ్కు సంబంధించి పట్టా సర్టిఫికెట్ అందచేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. నాట్ ట్రేసబుల్ కేసులలో ర్యాండమైజేషన్లో ఫారం%--%32లో అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం లబ్ధిదారులను గుర్తించాల్సిందిగా అధికారులకు వివరించారు. అలాగే లబ్ధిదారులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి త్వరగా జారీ చేయాలని సంబంధిత తహశీల్దార్లు, ఆర్డీవోలను కలెక్టర్ గౌతమ్ సమావేశంలో ఆదేశించారు. జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో ఎదురయ్యే సమస్యల గురించి అడిగి తెలుసుకొని... అందుకు అవసరమైన సలహాలు, సూచనలను కలెక్టర్ గౌతమ్ సమావేశంలో తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు .... జీహెచ్ఎంసీ ఇంజనీర్లు, ఆయా మండలాల తహశీల్దార్లు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదానం

శామీర్ పేట (గరుడ వార్త) : శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద బుధవారం ఘనంగా అన్నదానం నిర్వహించారు. శామీర్ పేట మండలం తూముకుంట మున్సిపల్ ఉప్పరపల్లి పరిధిలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళ్ళకల్ కు చెందిన అండాలు, ఉప్పరిపల్లికి చెందిన చీకోటి నరసింహ, యశోద దంపతులు, గున్నాల మల్లేష్, నాగమణి దంపతులు, తిమ్మాయిపల్లి కి చెందిన భూపాల్ రెడ్డి, విమల దంపతులు, బొమ్మ రాసి పేటకు చెందిన బిక్షపతి రెడ్డి, లక్ష్మీ దంపతులు, శ్రీకాంత్ రెడ్డి, శ్వేతా దంపతులు, వారి కుటుంబ సభ్యులు మానస, నితిన్ రెడ్డి ల సహకారంతో అన్నదానం చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.



# బేల, జైనథ్‌లకు బైపాస్ రోడ్లు..



ఆదిలాబాద్ : జిల్లాలో నిర్మించనున్న మరో నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి సర్వే పనులు చకచక సాగుతున్నాయి. మహారాష్ట్ర మీదుగా ఆదిలాబాద్‌కు వస్తున్న జాతీయ రహదారి నం.353 జిల్లాలోని బేల, జైనథ్‌ల మీదుగా భోరజ్ వరకు నిర్మించేందుకు ఇదివరకే నిధులు మంజూరైన విషయం తెల్సిందే. తాజాగా ఎలాంటి అడ్డంకులు లేకుండా, వాహనాల రాకపోకలు సులువుగా సాగిపోయేలా బేల, జైనథ్ మండల కేంద్రాల్లో రెండుచోట్ల బైపాస్ దారులు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. జిల్లా మీదుగా ఇదివరకే నాలుగు వరుసల రహదారి నం.44 అందుబాటులో ఉంది. ఆ దారికే కొత్తగా నిర్మించే నాలుగు వరుసల దారిని అనుసంధానించనున్నారు. జైనథ్ మండలం భోరజ్ వద్ద ఈ రెండు దారులు కలుస్తాయి. విస్తరించే కొత్తదారిని భోరజ్ నుంచి మొదలై తర్ణం, నిరాల, జైనథ్, దీపాయిగూడ మలుపు, కాప్రి మలుపు, బెల్గాం, బేల మండలం సిర్సన్న, బేల, కొబ్బాయి, శంకర్‌గూడ వరకు మొత్తం 33 కిలోమీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం జాతీయ రహదారిగా ఉన్న ఈ రెండు వరుసల దారినే నాలుగు వరుసల దారిగా మార్చేందుకు రూ.700 కోట్లు కేంద్రం నుంచి మంజూరు కాగా టెండర్ల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం ఓ ప్రయివేటు కన్సల్టెన్సీ సర్వే చేపడుతుండగా ఇందులో భాగంగానే బైపాస్ రోడ్ల పరిశీలనకు వచ్చాయి. కుడి వైపా? ఎడమ వైపా?

ప్రస్తుతం బేల, జైనథ్ మండల కేంద్రాల్లో అక్కడి పరిస్థితుల దృష్ట్యా బైపాస్ నిర్మాణాలే ఉత్తమమని అధికారులు భావిస్తున్నారు. మహారాష్ట్ర వైపు నుంచి భోరజ్‌కు వచ్చే దారిలో మండల కేంద్రానికి ఎడమవైపు బైపాస్ దారి నిర్మించాలా? లేక కుడివైపా అనేది ఇంకా తేలలేదు. బేలలో బైపాస్ నిర్మిస్తే చుట్టు నాలుగు కిలోమీటర్ల పొడవునా భూసేకరణ అవసరం. అదే జైనథ్‌లోనైతే మూడు కిలోమీటర్ల పొడవులో భూసేకరణ సరిపోతుంది. ఆయా మండల కేంద్రం మీదుగా ప్రస్తుతం వెళ్తున్న రోడ్డు పక్కల ఉన్న దుకాణాలు, ఇతర ఆస్తులు తొలగించి రోడ్డు నిర్మించాలా? అనే మూడో ప్రతిపాదన సైతం సిద్ధం చేశారు. బేల మండల కేంద్రంలో ఒక కిలోమీటర్ పొడవు, జైనథ్ మండల కేంద్రంలో 300 మీటర్ల పొడవులో ఈ దారి విస్తరించి ఉంది.

అయితే ఆస్తుల నష్టం అధికంగా ఉంటుందనే బైపాస్ రోడ్డు నిర్మాణానికి మొగ్గుచూపుతున్నారు. ఈ దారిపై సిమెంటు లారీలు, ఇతర వాహనాల రద్దీ ఉండటంతో బైపాస్ రోడ్డు నిర్మించాలని గతంలోనే బేలలో ఆందోళనలు సైతం జరిగాయి. అందుకనే అక్కడ బైపాస్ తప్పనిసరి అని అంచనా వేస్తున్నారు. ఎక్కడి నుంచి రోడ్డు అనువుగా ఉంటుందనే దానిపై డ్రోన్‌తో సర్వే చేపట్టారు. ఏ వైపు ఉంచి బైపాస్ నిర్మించాలి? లేక ఉన్న దారినే విస్తరించాలనే దానిపై వారం రోజుల్లోగా దిల్లీ నుంచి అనుమతి వస్తుందని జాతీయ రహదారుల కార్యాలయ డీఈ సుభాష్ తెలిపారు.

# ఎవరూలేని చోట.. వేసెయ్ బాట

ఆసిఫాబాద్: ఒక రోడ్డు వేస్తున్నారంటే ఆ ప్రాంతంలో ఎన్ని జనావాసాలు ఉన్నాయి. ఏయే వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఎంత మంది ప్రజలకు ఉపయోగపడుతుందనే లెక్కలను ఇంజినీర్లు వేస్తారు. అందుకు అనుగుణంగా అంచనాలు వేసి ప్రతిపాదనలు రూపొందిస్తారు. పరిపాలన అనుమతులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తారు. జిల్లాలో ఇందుకు భిన్నంగా నేతలు చెప్పిన చోట, నివాసాలు లేని ప్రదేశంలో ఇష్టానుసారంగా రహదారులను నిర్మిస్తున్నారు. డీఎంఎఫ్టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్) నిధులతో వేల సంఖ్యలో సీసీ రోడ్ల పనులే చేపడుతున్నారు. కేవలం బిల్లుల కోసమే పనులు అన్నట్లు ఇష్టారాజ్యంగా ప్రజాధనం వృథా చేస్తున్నారు. ఉపాధిహామీ, సీడీపీ నిధులు సైతం సీసీ రోడ్ల నిర్మాణాలకే అధికంగా ఖర్చు చేస్తున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇబ్బడిముబ్బడిగా వేసిన ఈ రోడ్లలలో నాణ్యతకు పాతరేస్తున్నారు. కనీస నిబంధనలేవీ పాటించకపోవడంతో నెలల వ్యవధిలోనే ఈ రోడ్లు ధ్వంసమవుతున్నాయి. అడిగేవారు లేకపోవడంతో అందినకాడికి దండుకుంటూ.. నాసిరకం పనులు చేస్తున్నారు. రోడ్డు పనుల్లో 1:2:4 పాళ్లలో ఇసుక, కంకర, సిమెంటు మిశ్రమం వినియోగించాలి. 150 మిల్లీ మీటర్ల ఎత్తుతో సీసీలను వేయాలి. ముందుగా ఆరు ఇంచుల వరకు రహదారిని తవ్వి, నాణ్యమైన మొరం వేసి చదును చేయాలి. సీసీ రహదారి వేసిన అనంతరం 28 రోజుల వరకు నీళ్లు పట్టాలి. ఇందులో ఒక్కటీ కూడా జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. హడావుడిగా, మొక్కుబడిగా పనులను పూర్తి చేస్తున్నారు.

అధిక మొత్తం ఆ పనులకే..

నాలుగు సంవత్సరాల కాలంలో జిల్లాకు డీఎంఎఫ్టీ నిధులు రూ.130 కోట్లు రాగా, ఇందులో రూ.117 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం 2574 పనులు చేపట్టగా ఇందులో దాదాపు 800 వరకు సీసీ రోడ్లే ఉన్నాయి. వీటిని సైతం నామినేషన్ పద్ధతిలో రూ.20 లక్షల రోడ్డును సైతం నాలుగు బిట్లుగా రూ.5 లక్షల చొప్పున విభజించి సీసీ పనులు చేపట్టారు. ఇలా అయితే ఎక్కువ మంది గుత్తేదారులకు అవకాశం ఉంటుందని, మామూళ్లు ఎక్కువ మొత్తంలో వస్తాయని కుయుక్తులు పన్నుతున్నారు. మరోవైపు ఉపాధిహామీ నిధులతో జిల్లా వ్యాప్తంగా 418 రహదారుల పనులు చేపట్టగా.. సీసీరోడ్లకే రూ.15 కోట్లు కేటాయించడం గమనార్హం.

ఎవరికి ఉపయోగమో..!

తిర్యాణి మండలంలోని పంగిడిమాదర సమీపంలో ఎలాంటి జనావాసాలు లేనిచోట రూ.4 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు ఇది. తలండిలో రూ.3 లక్షలతో గడలపల్లిలో రూ.4 లక్షలు ఖర్చు పెట్టి అసలు ఇళ్లే లేని ప్రదేశాల్లో రోడ్లు వేశారు. ఎవరికీ ఉపయోగపడని గిన్నెధరి శివారు ప్రాంతంలో రూ.10 లక్షలతో వేసిన సీసీరోడ్డు కొంతకాలానికే ధ్వంసమైంది.

వినియోగించడం లేదు..జిల్లా కేంద్రంలోని నూతన మిషన్ భగీరథ కార్యాలయం ఇటీవలే నిర్మించారు. ప్రధాన రహదారి నుంచి కార్యాలయానికి వెళ్లడానికి సీసీరోడ్డు నిర్మించి, ఓ భవనం చుట్టూ రహదారి వెళ్లడానికి మరో సీసీరోడ్డు ఏర్పాటు చేశారు. నిర్మించి సంవత్సరం గడుస్తున్నా ఈ రోడ్డును ఇంతవరకు వినియోగించలేదు. ఇందుకు రూ.2 లక్షలు ఖర్చు చేశారు.

# వసతి గృహాలకు సుస్తీ

ఆసిఫాబాద్: భవిష్యత్తు బాగుండాలని తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుతున్న విద్యార్థులకు ఇంటిని మరిపించే ఆహ్లాద భరితమైన వాతావరణం కల్పించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం అలసత్వం వల్ల అసౌకర్యాల మధ్యే చదువులు కొనసాగించాల్సి వస్తోంది. వసతితోపాటు బోధన అందించే ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. అపరిశుభ్ర పరిసరాలు, అసౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థులు జ్వరాలతో ఆసుపత్రికి వెళితే కొవిడ్ నిర్ధారణ అవుతుండటంతో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. జ్వరాల వేళ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పరిశీలన చేపట్టింది. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల ఆధ్వర్యంలో గురుకులాలు, వసతి గృహాలను నిర్వహిస్తున్నారు. గురుకులాల్లో విద్యార్థులకు కాస్త మెరుగైన సౌకర్యం ఉంటున్నా.. వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో మాత్రం సమస్యలు రాజ్యమేలుతున్నాయి. చాలీచాలని గదులు, సరిపడా లేని మరుగుదొడ్లు, శిథిల భవనాలు, అందని శుద్ధజలం, అపరిశుభ్ర వాతావరణం వెరసి విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు.

నిలిచిన ఏఎన్ఎంల సేవలు..

జిల్లాలో 40 గిరిజన ఆశ్రమోన్నత, ఆరు శాటిలైట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 11,666 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతేడాది వరకు ప్రతి పాఠశాలకు వైద్య సేవల కోసం ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఏఎన్ఎంలను కేటాయించారు. వారికి నెలకు రూ.నాలుగు వేలు వేతనం చెల్లించేవారు. వేతనం పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వేతనం పెంపుపై హామీ ఇవ్వకపోవడంతో వారు విధుల్లోకి రావడం లేదు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదమున్న నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల సేవలు నిలిచి పోవడం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తుంది. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే వారు సైతం ఆసుపత్రులకు పరుగులు తీయాల్సి వస్తోంది..

హాజరు అంతంతే..!

చిత్రంలో పడుకొని కనిపిస్తున్నది జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహం విద్యార్థి తరుణ్. ఏడో తరగతి జడ్పీ బాలుర పాఠశాలలో చదువుతూ ఇక్కడ వసతి పొందుతున్నాడు. తల, కడుపునొప్పితో బుధవారం సిక్ రూంలో పడుకున్నాడు. ప్రీ, పోస్టు మెట్రిక్ 70 మంది విద్యార్థులు ఇక్కడే వసతి పొందుతున్నారు. బుధవారం 15 మందే హాజరయ్యారు. వానలకు గదుల్లో నీరు చేరి ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోతున్నారు.

ఇంటిబాట పట్టిన విద్యార్థులు..

ఇది జిల్లా కేంద్రంలోని బీసీ వసతిగృహం. ఇక్కడ 112 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. భవనంలోని గదులన్నీ వర్షానికి ఊరుస్తున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చి పరిశీలించి మరమ్మతులకు ఆదేశించారు. ఎడతెరిపిలేని వానలతో పనులు చేసే పరిస్థితి లేక ఆలస్యమవుతోంది. రెండురోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మళ్లీ గదుల్లో నీరు చేరింది. ఇలాంటి గదుల్లో ఉండలేక విద్యార్థులంతా ఇంటిబాట పట్టారు. ముందే మురుగు..కాగజ్‌నగర్‌లోని ఆశ్రమోన్నత బాలుర పాఠశాల ముందు మురుగు కాలువతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణంతో దోమలు వృద్ధిచెంది వ్యాధులు ప్రబలుతు న్నాయని వాపోతున్నారు. 120 మందికి 110 హాజరయ్యారు. నీటిశుద్ధి యంత్రం పని చేయడంలేదు. మెనూ సక్రమంగా పాటించడంలేదు. వార్డెన్ అందుబాటులో ఉండటం లేదని విద్యార్థులు చెబుతున్నారు.

# 'ప్రత్యేక' నిధులు రద్దుతో ఇబ్బందులు

సంగారెడ్డి : గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్‌డీఎఫ్) ద్వారా చేపట్టిన పనులు రద్దు చేయాలని కొత్త ప్రభుత్వం ఇటీవల పంచాయతీరాజ్ శాఖను ఆదేశించింది. ఇప్పటికే ప్రారంభించి.. అసంపూర్తిగా వదిలేసిన పనులతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన పనులను చేపట్టాలని చర్చ జరిగిన నేపథ్యంలో కథనం.

పంచాయతీలు, మున్సిపాలిటీలకు..

గతేడాది ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నారాయణఖేడ్‌లో పర్యటించారు. సంగమేశ్వర ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ సభలో ఎస్‌డీఎఫ్ నిధులు ప్రకటించారు. ప్రతి గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు, పురపాలికల్లో సంగారెడ్డికి రూ.50 కోట్లు, మిగిలిన వాటికి రూ.25 కోట్ల చొప్పున ఇస్తున్నట్టు హామీ ఇచ్చారు. ఈ మేరకు జిల్లాలో 2,723 పనులకు రూ.136.15కోట్లను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు 1,612 పనులు పూర్తి చేయగా.. 482 ప్రగతి దశలో ఉన్నాయి. 629 పనులు ఇంకా ఆరంభించలేదు. పటాన్‌చెరు పర్యటనలోనూ నిధుల మంజూరుపై అప్పటి సీఎం ప్రకటన చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గానికి సంబంధించి 130 పనులు మంజూరు కాగా.. 69 వివిధ దశల్లో ఉన్నాయి. 61 పనులను ఇంకా ఆరంభించలేదు.

క్షేత్ర స్థాయి పరిస్థితి

పటాన్‌చెరు మండలం పాటి గ్రామ పంచాయతీ భవనం, ఇస్నాపూర్‌లో సామాజిక భవన నిర్మాణానికి రూ.15 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు.

గుమ్మడిదల మండలం అన్నారంలో ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి మసీదు వరకు సీసీ రహదారి కోసం రూ.5 లక్షలు మంజూరైనా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు.

పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సోమశిల టౌన్‌షిప్ రోడ్డుకు రూ.15 లక్షలు కావాలని ప్రతిపాదించారు. నిధులొచ్చినా పనుల్లో కదలిక లేదు.

జిన్నారం మండలం ఊట్లలో మంచినీటి ట్యాంకు నుంచి రూ.5 లక్షలతో చేపిట్టిన సీసీ పనులు అసంపూర్తిగా వదిలేశారు. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అదే మండలం దాదిగూడెంలో చేపట్టిన పనులు పూర్తయ్యాయి.

హత్నూర మండలం బొక్కలగూడెంలో అంగన్‌వాడీ భవనం నిర్మానానికి రూ.15 లక్షలిచ్చారు. ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. హత్నూర పరిధిలోని 111 పనుల్లో ఒక్కటీ చేపట్టకపోవడం గమనార్హం.



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు

జిల్లాలో గతంలో కేటాయించిన ఎస్‌డీఎఫ్ పనులు రద్దు చేయాలని కొత్త ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రూ.కోటి లోపు బకాయిలున్న గుత్తేదారులకు బిల్లులు సమస్య లేకుండా చేయాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. త్వరలో వారికి బిల్లులు వచ్చే అవకాశం ఉంది. మిగతా పనులు ప్రారంభంపై ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాలను అమలు చేస్తాం.

జగదీశ్వర్, పీఆర్ ఈఈసంగారెడ్డి అర్బన్, జిన్నారం, జోగిపేట: గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్‌డీఎఫ్) ద్వారా చేపట్టిన పనులు రద్దు చేయాలని కొత్త ప్రభుత్వం ఇటీవల పంచాయతీరాజ్ శాఖను ఆదేశించింది. ఇప్పటికే ప్రారంభించి.. అసంపూర్తిగా వదిలేసిన పనులతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన పనులను చేపట్టాలని చర్చ జరిగిన నేపథ్యంలో కథనం.

పంచాయతీలు, మున్సిపాలిటీలకు..

గతేడాది ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నారాయణఖేడ్‌లో పర్యటించారు. సంగమేశ్వర ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ సభలో ఎస్‌డీఎఫ్ నిధులు ప్రకటించారు. ప్రతి గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు, పురపాలికల్లో సంగారెడ్డికి రూ.50 కోట్లు, మిగిలిన వాటికి రూ.25 కోట్ల చొప్పున ఇస్తున్నట్టు హామీ ఇచ్చారు. ఈ మేరకు జిల్లాలో 2,723 పనులకు రూ.136.15కోట్లను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు 1,612 పనులు పూర్తి చేయగా.. 482 ప్రగతి దశలో ఉన్నాయి. 629 పనులు ఇంకా ఆరంభించలేదు. పటాన్‌చెరు పర్యటనలోనూ నిధుల మంజూరుపై అప్పటి సీఎం ప్రకటన చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గానికి సంబంధించి 130 పనులు మంజూరు కాగా.. 69 వివిధ దశల్లో ఉన్నాయి. 61 పనులను ఇంకా ఆరంభించలేదు.

క్షేత్ర స్థాయి పరిస్థితి

పటాన్‌చెరు మండలం పాటి గ్రామ పంచాయతీ భవనం, ఇస్నాపూర్‌లో సామాజిక భవన నిర్మాణానికి రూ.15 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు.

గుమ్మడిదల మండలం అన్నారంలో ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి మసీదు వరకు సీసీ రహదారి కోసం రూ.5 లక్షలు మంజూరైనా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు.

పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సోమశిల టౌన్‌షిప్ రోడ్డుకు రూ.15 లక్షలు కావాలని ప్రతిపాదించారు. నిధులొచ్చినా పనుల్లో కదలిక లేదు.

జిన్నారం మండలం ఊట్లలో మంచినీటి ట్యాంకు నుంచి రూ.5 లక్షలతో చేపిట్టిన సీసీ పనులు అసంపూర్తిగా వదిలేశారు. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అదే మండలం దాదిగూడెంలో చేపట్టిన పనులు పూర్తయ్యాయి.

హత్నూర మండలం బొక్కలగూడెంలో అంగన్‌వాడీ భవనం నిర్మానానికి రూ.15 లక్షలిచ్చారు. ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. హత్నూర పరిధిలోని 111 పనుల్లో ఒక్కటీ చేపట్టకపోవడం గమనార్హం.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు

జిల్లాలో గతంలో కేటాయించిన ఎస్‌డీఎఫ్ పనులు రద్దు చేయాలని కొత్త ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రూ.కోటి లోపు బకాయిలున్న గుత్తేదారులకు బిల్లులు సమస్య లేకుండా చేయాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. త్వరలో వారికి బిల్లులు వచ్చే అవకాశం ఉంది. మిగతా పనులు ప్రారంభంపై ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాలను అమలు చేస్తాం. జగదీశ్వర్, పీఆర్ ఈఈ

# మీ దరఖాస్తు ఎక్కడుందో తెలుసా..!



సూర్యాపేట: ప్రజల వద్దకే పాలన లక్ష్యంతో ఆరు గ్యారంటీల అమలుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా మరో అడుగు ముందుకేసింది. ప్రజాపాలనకు సంబంధించి ప్రత్యేక వెబ్‌సైట్ %prajapalana.telangana.gov.in%ను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో 11,91,918 మంది దరఖాస్తులు సమర్పించారు. స్వీకరించిన అర్జీలన్నింటిని ఈనెల 17లోగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా...అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎనిమిది రోజుల పాటు సాగిన ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకం, రూ.500 వంట గ్యాసు, కొత్త రేషన్ కార్డులు, పింఛన్ల కోసం ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. ఆరు గ్యారంటీల అమలుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఛైర్మన్‌గా కేబినెట్ సబ్ కమిటీని నియమించింది. ఇందులో సభ్యులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు ఉండనున్నారు. నిజమైన లబ్ధిదారులకు అభయహస్తం పథకాలు అందించడమే లక్ష్యంగా సబ్ కమిటీ పనిచేయనుంది.

ఆన్‌లైన్ ప్రక్రియ ముగిశాక...ప్రస్తుతం గ్రామస్థాయిలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఈ ప్రక్రియ ఈనెల 17 వరకు జరగనుంది. దరఖాస్తులు ఆన్‌లైన్ అయిన తర్వాతే వెబ్‌సైట్‌లో దరఖాస్తుల స్థితి తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. మొదట ప్రజాపాలన వెబ్‌సైట్‌కి వెళ్లి అక్కడ యువర్ అప్లికేషన్ స్టేటస్‌పై క్లిక్ చేస్తే అప్లికేషన్ నంబర్ అడుగుతుంది. నెంబర్‌ను అందులో నమోదు చేస్తే దరఖాస్తు స్థితి, ఏఏ పథకాలకు అర్హులుగా ఉన్నారనే విషయాలను తెలుసుకోవచ్చు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి నాలుగు నెలలకు ఒకసారి నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ఇది వరకే ప్రకటించిన విషయం విదితమే.

సైబర్ మోసాలకు అవకాశం...

అభయహస్తం పథకాలు అమలుచేయటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన పేరిట ప్రత్యేక వెబ్‌సైట్ తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశముందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి ఓటీపీలు అడుగుతున్నట్లు సమాచారముందని, ఇటువంటి కాల్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అపరిచితులు పంపించే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదని, ఓటీపీలను చెప్పవద్దని చెబుతున్నారు. మోసానికి గురైతే బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలంటున్నారు.

17 వరకు కొనసాగుతుందివెంకటరావు, జిల్లా కలెక్టర్, సూర్యాపేట ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్నాం. ప్రస్తుతం ఈ ప్రక్రియ ముందుగా ప్రకటించిన విధంగా ఈనెల 17వరకు కొనసాగుతోంది. అనంతరం పూర్తి సమాచారం అందుతుంది. అప్పటి వరకూ దరఖాస్తుదారులు నిరీక్షించాలి. చరవాణికి వస్తున్న లింకులపై జాగ్రత్తలు తీసుకోవాలి.

# ఇల్లే లేదు.. నంబరొచ్చింది..!



సూర్యాపేట: దేవరకొండ పురపాలికలో అవినీతి, అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా అవుతున్నా.. పురపాలిక అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమించి సొంత భూముల్లో కలిపేసుకుంటున్న తీరు ఒక వంతయితే.. పురపాలికశాఖ అధికారుల అక్రమాలతో ఖాళీస్థలాలకు సైతం ఇంటి నంబరు మంజూరు చేయడం మరోవంతైంది. ఆ ఖాళీస్థలాలకు హద్దులు చూపిస్తూ రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి. కాసుల కక్కుర్తితో ఎలాంటి భూమికైనా అధికారులు క్షణాల్లో ఇంటి నంబరు మంజూరు చేస్తున్నారు. కొన్నేళ్ల నుంచి ఈ తతంగం పెద్దఎత్తున దేవరకొండ పురపాలికలో చోటుచేసుకుంటున్నా ఉన్నతాధికారులు విచారణ చేపట్టడం లేదన్న ఆరోపణలున్నాయి.

మచ్చుకు కొన్ని

దేవరకొండ పురపాలిక పరిధిలో సర్వే నెం.750 అయ్యప్పనగర్‌లో అత్యంత విలువైన ప్రభుత్వ భూములున్నాయి. వీటిని సొంతం చేసుకునేందుకు ఇంటి నంబర్ పొందాలనే తాపత్రయంతో అక్రమార్కులు పుర అధికారులను కలిశారు. ఇది ప్రభుత్వ భూమి కావడంతో సర్వే నంబర్ లేకుండా ఇంటి నంబర్ కేటాయించారు. ఈ సర్వే నంబర్‌లో తొమ్మిది ఎకరాలు ఉండగా వాటిలో ఇలానే అక్రమాలకు పాల్పడ్డారు.

దేవరకొండ పట్టణంలోని డిండిరోడ్‌లోని సర్వే నెం.657లో 118 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. వీటిలో కొంతభాగం ప్రభుత్వం పట్టాలు ఇవ్వగా మిగతా స్థలం అన్యాక్రాంతమైంది. ఈ కబ్జా భూములు పక్కాగా చేసుకునేందుకు పుర సిబ్బందితో కుమ్మక్కై ఇంటి నంబర్ పొంది నిర్మాణాలు చేపడుతున్నారు.

దేవరకొండ పట్టణంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై ఉన్న వక్ఫ్ భూమి సర్వే నెం.753 ఉండడంతో పక్కనే ఉన్న పట్టా నెం.751 సర్వే నెంబర్ పొందేందుకు అక్రమ మార్గాన ఇంటి నెంబర్ పొంది రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. తద్వారా ప్లాటును లింక్ డాక్యుమెంట్ చూపిస్తూ ఇతరులకు విక్రయిస్తున్నారు. ఇలా ప్రభుత్వ, వక్ఫ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి.

గ్రామపంచాయతీల్లో సైతం..

సులువుగా ప్లాటును రిజిస్ట్రేషన్ చేసేందుకు పంచాయతీ అధికారులతో కలిసి కొంతమంది అక్రమార్కులు ఇంటి నెంబర్ల విధానానికి తెరతీశారు. నాంపల్లి, చింతపల్లి మండలాలకు సంబంధించిన ప్లాట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్ కావడంతో గతంలో నాంపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెండ్ అయిన ఘటనలున్నాయి. ఈ తతంగం జరుగుతున్నా ఉన్నతాధికారులు స్పందించడం లేదు. గ్రామపంచాయతీ ఆదాయానికి గండిపడుతున్న ఇలాంటి సంఘటనలపై విచారణ నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

నా దృష్టికి రాలేదు: వెంకటయ్య, పురపాలిక కమిషనర్


దేవరకొండ పట్టణంలో ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు ఇచ్చినట్లు నా దృష్టికి రాలేదు. నా హయాంలో మాత్రం అలాంటి ఘటనలు జరిగినట్లు సమాచారం లేదు. ఒకవేళ వస్తే వాటిపై పరిశీలించి చర్యలు తీసుకుంటాను.

# ధరణిపై కూపీ

హైదరాబాద్ :ధరణి కేంద్రంగా జరిగిన భూముల అక్రమ క్రయ, విక్రయ లావాదేవీల గుట్టువిప్పేందుకు అధికారులు సిద్ధమయ్యారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను కూడా ప్రైవేటు భూములుగా మార్చి వీటిని పెద్దఎత్తున ధరణిలో రిజిస్ట్రేషన్లు చేశారని చెబుతున్నారు. ఇలా జరిగిన లావాదేవీల విలువ రూ.వేల కోట్లలోనే ఉంటుందని ప్రాథమికంగా అభిప్రాయపడుతున్నారు. కొన్ని రిజిస్ట్రేషన్లు ముందుగా కొంతమంది వ్యక్తుల పేరుతో జరిగిన కొద్దిరోజులకే కొన్ని రియల్ సంస్థల పేరుతో బదలాయించినట్లు చెబుతున్నారు. అలా రాజధాని చుట్టూ ఏడాది కాలంగా వేలాది ఎకరాల అక్రమ లావాదేవీలు జరిగినట్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వాటిని పరిశీలించి తుది నివేదికకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఏడాది కాలంగా అనేక మండలాల్లో భారీగా భూ కుంభకోణాలు చోటు చేసుకున్నాయి. శంషాబాద్, మొయినాబాద్ మండలాల నుంచి మొదలుపెడితే అనేక గ్రామాల్లో వేలాది ఎకరాల అసైన్డ్ భూముల విక్రయాలు భారీఎత్తున జరిగాయి. నిబంధనల ప్రకారం అనేక ఏళ్ల కిందట రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూములను సాగు చేసుకోవాలి తప్ప వీటిని అమ్మకూడదు. ఆ సర్వే నెంబర్లను నిషేధిత జాబితాలో పెట్టారు. ఈసర్వే నెంబర్లు ధరణిలో కన్పించవు. ఉన్నత స్థాయిలో జరిగిన అక్రమాల నేపథ్యంలో నిషేధిత జాబితాలో ఉన్న కొన్ని సర్వే నెంబర్లను మార్చేశారు. మరికొన్నిచోట్ల బై (/) నెంబర్లు వేసి వీటిని ప్రైవేటు భూములుగా చూపించి రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో కొంతమంది రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల పాత్ర ఉందని చెబుతున్నారు. శంషాబాద్, మొయినాబాద్, శేర్‌లింగంపల్లి తదితర మండలాల్లో వందలాది రైతులను బెదిరించి అసైన్డ్ భూములను రాజకీయ ప్రమేయంతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని సమాచారం.

# పదవులకు ప్రయత్నాలు

సంగారెడ్డి :నామినేటెడ్ పదవుల భర్తీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించడంతో గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. నియోజకవర్గంలో ప్రధానంగా రెండు మార్కెట్ కమిటీలు, దేవాలయాల పాలక మండళ్లు, ఆత్మకమిటీల ఛైర్మన్లతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి సభ్యులుగా నియమించుకునే అవకాశం ఉంది. ఇందుకోసం ఆశావహులు అధిష్ఠానంతో పాటు జిల్లా ముఖ్యనేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన వారే కావటంతో స్థానిక నేతలు ఆయన వద్దకు వెళ్లి అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలిసింది. నియోజకవర్గం గజ్వేల్ అయినప్పటికీ జిల్లాపరంగా చూస్తే తూప్రాన్, మనోహరాబాద్ మెదక్ పరిధిలో ఉన్నాయి. ఆ మండలాల నాయకులకు గజ్వేల్ సెగ్మెంట్



పరిధిలో ఎటువంటి అవకాశం ఇస్తారనేది తేలాల్సి ఉంది. గతంలో పలు నియామక పదవులు చేపట్టిన నాయకులున్నారు. వారికి మళ్లీ అవకాశం ఇస్తారా? కొత్త వారికి అవకాశం ఇస్తారా? అని పలువురు చర్చించుకుంటున్నారు. గతంలో పలు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ముఖ్య నేతలకు నియామక పదవుల్లో ప్రాధాన్యం ఇస్తారని తెలుస్తోంది. రాష్ట్రస్థాయిలో ఎవరికి?..రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా.. స్థానికంగా ప్రతిపక్షనేత కేసీఆర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, ఇతర ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన సందర్భంలో ప్రొటోకాల్ పాటించాల్సిన పరిస్థితి. ఈ సందర్భంలో ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నేతలకు సముచిత స్థానం కల్పిస్తుందా.. లేదా అనేదానిపై స్థానిక నేతలు చర్చించుకుంటున్నారు.

# మార్కెట్ పదవులపై ఆశలు

రాంనగర్ : వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతోపాటు కొత్త కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు చేసుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించడం మార్కెట్ పదవులపై పలువురు నేతల్లో ఆశలు రేకెత్తించింది. గత ప్రభుత్వం మార్కెట్ ఛైర్మన్ల పదవులకు రోస్టర్ విధానంతో రిజర్వేషన్లు వర్తింపజేయడంతోపాటు పదవి కాలాన్ని రెండేళ్లు చేసింది. వాటి ప్రకారమే ఛైర్మన్లను నియమించారు. తాజాగా ముఖ్యమంత్రి ప్రకటనతో పదవులపై ఆశలు చిగురించినా రిజర్వేషన్లపై అయోమయం నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని 17 మార్కెట్లలో కేవలం పదింటికే ఛైర్మన్లు ఉన్నారు. మిగిలిన మార్కెట్లు పర్సన్ ఇన్‌ఛార్జులతో కొనసాగుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని అయిదు మార్కెట్లలో ఇంద్రవెల్లి, ఇచ్చోడ మార్కెట్లకు పాలకవర్గం ఏర్పాటు కాలేదు. గత ప్రభుత్వం నుంచి పాలకవర్గం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినా.. భర్తీకి నోచుకోలేదు. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూర్, జన్నారం మార్కెట్లకు పాలకవర్గం ఉంది. మంచిర్యాల, లక్షెట్టిపేట మార్కెట్లకు కొత్తగా ఏర్పాటు చేయాలి. కుమురం భీం జిల్లాలో జైనూర్, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మార్కెట్లకు పాలకవర్గం లేదు. పర్సన్ ఇన్‌ఛార్జులతో కొనసాగుతున్నాయి. నిర్మల్ జిల్లాలో సారంగాపూర్, భైంసా, నిర్మల్, ఖానాపూర్ మార్కెట్లలో పాలకవర్గం ఉంది. మిగిలిన మార్కెట్లకు లేదు. గత ప్రభుత్వం నియమించిన పాలకవర్గాలను రద్దు చేయాలని



ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వం నుంచి రద్దు ఉత్తర్వులు వస్తే.. మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఏం చేస్తుందో..?

మార్కెట్ల వారీగా ఛైర్మన్ పదవికి గత ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించింది. రోస్టర్ పద్ధతిలో 2026 వరకు మార్కెట్ల వారీగా రిజర్వేషన్లు గతంలోనే ప్రకటించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రిజర్వేషన్ల ప్రకారం ప్రతిపాదనలు తీసుకుంటారా.. లేదా వాటిని పూర్తిగా రద్దు చేస్తారా అనేది తేలాల్సి ఉంది. ప్రస్తుత పాలకవర్గాలను ప్రభుత్వం రద్దు చేస్తే.. న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు ఛైర్మను రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గతంలో భారాస అధికారంలోకి రాగానే మార్కెట్ పాలకవర్గాలను రద్దు చేస్తే.. అప్పటి ఛైర్మన్లు కోర్టును ఆశ్రయించి తిరిగి పదవి కాలం పూర్తి అయ్యే వరకు ఉన్నారు. తొలివిడతలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న మార్కెట్లకు పాలకవర్గాన్ని ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో ప్రస్తుత రిజర్వేషన్ల ప్రకారం పదవులను పొందేందుకు పావులు కదుపుతున్నారు.

కాంగ్రెస్ నేతల్లో ఆశలు..

జిల్లాల వారీగా పాలకవర్గం లేని మార్కెట్లలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో అనేక మంది నేతలు పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పదవిని పొందాలంటే ఆయా మార్కెట్ పరిధిలోని గ్రామానికి చెందిన రైతులై ఉండాలి. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులతో పాటు పాలకవర్గం మొత్తం స్థానిక ఎమ్మెల్యే ప్రతిపాదించాల్సి ఉంటుంది. అధికార పార్టీ ఎమ్మెల్యే లేని పక్షంలో ఇన్‌ఛార్జి మంత్రి సూచించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల, చెన్నూర్, ఖానాపూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. మార్కెట్ పాలకవర్గాలను రిజర్వేషన్ పద్ధతిన భర్తీ చేసేందుకు ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. మార్కెట్ల వారీగా పదేళ్ల వరకు ఒకేసారి రిజర్వేషన్లను నిర్ణయించారు. గతంలో మూడేళ్లు ఉండేది. అలాంటిది భారాస ప్రభుత్వం పదవి కాలాన్ని ఏడాది చేసింది. తిరిగి అదే ప్రభుత్వం రెండేళ్లు చేసింది.

# వ్యాపారుల 'చేతి'వాటం.. రైతులకు సంకటం..!

ఖమ్మం: మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు తయారైంది మిరప రైతుల పరిస్థితి. ఓవైపు దిగుబడులు గణనీయంగా తగ్గటం.. మరోవైపు మార్కెట్‌లో ధరల పతనంతో కర్షకులు కుదేలవుతున్నారు. నాణ్యత లేదని, తేమ, తాలు అధికంగా ఉందని, రంగు మారిందని సాకులు చూపుతూ ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కార్యకలాపాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే తాము నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

పర్యవేక్షణ శూన్యం..!

రాష్ట్రంలోనే ఖమ్మం వ్యవసాయ మార్కెట్ రెండో అతిపెద్దది. ఏటా పత్తి, మిరప సీజన్‌లో రూ.వందల కోట్లలో క్రయవిక్రయాలు సాగుతుంటాయి. ప్రతి సీజన్‌లో మార్కెట్ ఆదాయం రూ.25 కోట్ల మేర ఉంటోంది. మిరప సీజన్‌లో సుమారు 100 రోజుల పాటు కొనుగోళు సాగుతుంటాయి. నిత్యం సగటున 2వేల మంది రైతులు మిరప అమ్ముకునేందుకు వస్తుంటారు. అన్నదాతలకు దన్నుగా నిలవాల్సిన మార్కెట్‌లో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. సిబ్బంది కొరత, కీలక అధికారుల పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉండటం రైతులకు శాపంగా మారుతోంది.

రెండు దశాబ్దాల క్రితమే ఉన్నతీకరించినా..

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సుమారు రెండు దశాబ్దాల క్రితం ఉన్నతశ్రేణి విపణిగా మార్పు చెందింది. అయితే అందుకు అనుగుణంగా మానవ వనరులు లేవు. మార్కెట్ హోదా ప్రకారం ఓ ఉన్నతశ్రేణి కార్యదర్శి, ఇద్దరు అసిస్టెంట్ కార్యదర్శులు విధులు నిర్వర్తించాలి. కొన్నేళ్లుగా రెగ్యులర్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉంది. అదనపు బాధ్యతలపై వస్తున్న అధికారులందరూ కొంతకాలం పనిచేసి



బదిలీపై వెళ్తున్నారు. ఆరు నెలలుగా సంబంధిత అధికారే లేరు. ఒక్క అసిస్టెంట్ కార్యదర్శే విధులు నిర్వర్తిస్తున్నారు. మార్కెట్‌లో కార్యకలాపాలు సక్రమంగా సాగాలంటే సుమారు 70 మంది సిబ్బంది అవసరమున్నా 15 మందితోనే నెట్టుకొస్తున్నారు. కీలకమైన జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ఇక్కడ లేరు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారే ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

యంత్రాల వినియోగమేదీ..?

మార్కెట్‌లో మిరప కొనుగోళ్లను వ్యాపారులే శాసిస్తున్నారు. తేమశాతం నిర్ధారణకు యంత్రం ఉపయోగించకుండా నోటిమాటగా ఏదో ఒకటి చెప్పి రైతులను మోసగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేమీ పట్టదన్నట్టు వ్యవహరిస్తుండటంతో అన్నదాతలు నష్టపోతున్నారు. మార్కెట్‌లో రూ.లక్షల విలువ చేసే నాణ్యత ప్రమాణాల నిర్ధారణ యంత్రాలు వినియోగించటమే లేదు. వ్యాపారులు చేతులతో పరిశీలించి సరకుకు ధర నిర్ణయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నా ఇదేంటని అడిగే దిక్కు లేకుండా పోయింది.

మంత్రి తుమ్మల రాకతో..

మార్కెట్‌లో మిరప కొనుగోళ్ల తీరును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. జెండా పాట అధికంగా ఉన్నప్పటికీ రైతులకు ఎందుకు ఆ ధర దక్కటం లేదని అధికారులు, వ్యాపారులను ప్రశ్నించారు. జెండా పాట ధరతో స్వల్పమొత్తంలో కొనుగోళ్లు జరగటంపై ఆరా తీశారు. తేమశాతం నిర్ధారణకు చేతులు బ్రహ్మపదార్థంలా ఉపయోగపడతాయా అని వ్యాపారులపై మండిపడ్డారు. ఈ పరిణామాల తర్వాత మిరప కొనుగోళ్లలో స్పష్టమైన తేడా కనిపించింది. మార్కెట్‌లో జెండా పాట రూ.21వేలు పలికింది. మంత్రి తుమ్మల రాకముందు క్వింటా మిరప ధర రూ.15వేలు మించలేదు. మంత్రి వచ్చిన తర్వాత రూ.2 వేలు పెంచి రూ.17వేలకు వ్యాపారులు కొనటం విశేషం. ఒక్కరోజే కాకుండా అధికార యంత్రాంగం ఈ సీజన్ మొత్తం మిరప కొనుగోళ్లను పర్యవేక్షిస్తే రైతులకు న్యాయం దక్కుతుందనే భావన వ్యక్తమవుతోంది.

# శంషాబాద్ విమానాశ్రయ సమీపంలో 650 కోట్ల సర్కారు భూముల కబ్జా!


హైదరాబాద్ : సర్కారు భూములు ఖాళీగా ఉంటే చాలు కబ్జాలకు తెగబడుతున్న అక్రమార్కులు అత్యంత తెలివిగా వాటిని సొంతం చేసుకుంటున్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి, హైదరాబాద్–బెంగుళూరు జాతీయ రహదారికి సమీపంలో కొత్వాల్ గూడ ఓఆర్ఆర్ పక్కన ఉన్న సర్వే నంబర్ 73లోని 16.15 ఎకరాలను ఆక్రమించేందుకు పన్నాగం పన్నారు. వీటి విలువ రూ.650 కోట్లకుపైగానే ఉంటుంది. భారీ స్థాయిలో బహుళ అంతస్తుల నిర్మాణం, గేటెడ్ కమ్యూనిటీలున్న ఈ ప్రాంతంతో ప్రస్తుతం ఎకరా రూ.40 కోట్లకుపైనే పలుకుతోంది. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ సర్వేనంబర్ 50–78 వరకు మొత్తం 620 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ప్రహరీ కట్టి గేటు ఏర్పాటు చేసి లోపల షెడ్డు నిర్మించారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం స్పందించడం



లేదు. దీనిపై శంషాబాద్ తహసీల్దార్ నాగమణిని వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

కబ్జాలపై కళ్లు మూసుకుంటున్నారు...శంషాబాద్, రాజేంద్రనగర్, బుద్వేల్ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల కబ్జాకు కొన్నినెలల నుంచి ప్రయత్నాలు చేస్తున్నా అధికారులు మిన్నకున్నారు. రెవెన్యూ కార్యాలయంలోని ఓ కీలక అధికారి, ఇద్దరు కిందిస్థాయి సిబ్బందికి కబ్జాదారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. స్థానిక ప్రజాప్రతినిధి అనుచరులు ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నాయో చూసి స్థిరాస్తి సంస్థల ప్రతినిధులకు సమాచారమిచ్చి ఆక్రమించుకోవాలని సూచిస్తున్నట్లు తెలిసింది.

# లక్ష్యానికి ఉపాధి దూరం!



కరీంనగర్: ఉన్న ఊళ్లో కూలీలకు ఉపాధి హామీ అనుకున్న విధంగా దక్కలేదు. పూర్తిస్థాయిలో పనుల అంచనాలు లేకపోవడంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అరకొర పురోగతి కనిపించింది. మరో రెండున్నర నెలల్లో ఈ వార్షిక సంవత్సరం (2023–24) ముగియనుంది. గడిచిన కొన్ని నెలలుగా కూలీల రాక తగ్గింది. ఒకప్పుడు జాతరలా పని కోసం కదిలిన పల్లెల్లో ప్రస్తుతం వేళ్ల మీద లెక్కబెట్టే స్థాయిలో కొందరికే ఉపాధి లభించింది.

అడపాదడపా...గతేడాది నాలుగు జిల్లాల పరిధిలో ఏకంగా 1,12,10,393 పని దినాలు కూలీలకు అందాయి. కానీ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 79,20,036 పనిదినాలను సాధించగలిగారు. ఇంకా దాదాపుగా 32.90 లక్షల పని దినాలను సాధిస్తేనే గతేడాదికి భిన్నంగా జిల్లావాసులకు ఉపాధి హామీ పక్కాగా లభించనుంది. వాస్తవానికి ఈసారి గతేడాది మాదిరిగా కాకుండా కనీసం కోటి పనిదినాల కల్పన లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. గ్రామసభలు పెట్టి.. ఉపాధి పనుల ఎంపిక సమయంలోనే తక్కువ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఉన్న ఊళ్లలో పనులు అడపాదడపా జరగగా కొన్నిచోట్ల కూలీలకు ఆసక్తి ఉన్నా.. పని దక్కలేదు. వీలైనంత ఎక్కువ మందికి వందరోజుల ఉపాధి హామీ అమలు అనేది ప్రతి ఏడాదికింతగా తగ్గిపోతోంది.

ఇలా పురోగతి..

ఉమ్మడి జిల్లాలో 2,32,191 కుటుంబాలు ఉపాధి హామీ పనుల పట్ల ఆసక్తి చూపించగా.. ఈసారి 2,06,481 మంది పనిని అందుకున్నారు. 88.92 శాతం ప్రగతి కనిపించింది.

3,30,991 మంది కూలీలున్నారు. ఇందులో ఈ ఏడాది 2,77,684 మంది ఉపాధి పనికి వెళ్లారు. 53,307 మంది వెళ్లలేదు.

గతేడాది మే నెలలో రికార్డు స్థాయిలో 1,21,165 మంది పని ప్రదేశాలకు వెళ్లారు. ఈ జనవరిలో మాత్రం కేవలం 34,626 మంది కూలీలు పని చేశారు.

వ్యవసాయ పనులు, వర్షాలు కురిసినప్పుడు, ఎన్నికల హడావుడి ఉన్న సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో ఉపాధిహామీ పనులు నామమాత్రంగానే సాగాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సారి కేవలం 4,911 కుటుంబాలకు వంద రోజుల పని అందింది. ఇందులో కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా 3,358 కుటుంబాలు లబ్ధి పొందాయి.

# ప్రత్యేక నిధులతోనే సమస్యల పరిష్కారం



గోదావరిఖని : నిత్యం రద్దీగా ఉండే కల్యాణ్‌నగర్–మేదరిబస్తీ రోడ్డు గోతులమయం కావడంతో వ్యాపారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ తారు రోడ్డు నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తికాగా భూగర్భ మురుగు కాలువ నిర్మించాక రోడ్డు వేయాలంటూ రోడ్డు పనులను మొదలు పెట్టలేదు. ఈ లోగా సుమారు రూ.50 లక్షల వ్యయంతో భూగర్భ మురుగు కాలువ నిర్మాణం చేపట్టినప్పటికీ రోడ్డు వేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాజాగా తారు రోడ్డుకు బదులుగా సిమెంటు రోడ్డు వేయాలని కల్యాణ్‌నగర్, లక్ష్మీనగర్ తదితర వ్యాపార కేంద్రం రింగు రోడ్డు, భూగర్భ మురుగు కాలువ, కేంద్రీకృత విద్యుత్తు దీపాల ఏర్పాటుకు రూ.34 కోట్లతో నగరపాలిక అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు విడుదలైతే రోడ్డు, మురుగు కాలువలు తదితర సమస్యలు పరిష్కారం కానున్నాయి. సిద్ధమైన సమగ్ర ప్రణాళిక వ్యాపార కేంద్రమైన కల్యాణ్‌నగర్‌తో పాటు లక్ష్మీనగర్, మేదరిబస్తీ తదితర ప్రాంతాల్లోనూ రోడ్డు, మురుగు కాలువలు, కేంద్రీకృత విద్యుత్తు దీపాల సమస్యలను పరిష్కరించాలని నగరపాలిక సంకల్పించింది. ఇటీవల రామగుండం అభివృద్ధిని సమీక్షించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్.. తారు రోడ్డుకు బదులుగా సిమెంటు రోడ్డు వేయాలని, కేవలం కల్యాణ్‌నగర్‌కే పరిమితం కాకుండా వ్యాపార కేంద్రం మొత్తంలో సమస్య పరిష్కరించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ మేరకు నగరపాలిక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రూ.34 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్‌కు ఇచ్చారు. ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు విడుదల అయితే ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది. ఇప్పటికే రూ.2 కోట్లు, రూ.1.2 కోట్లతో కల్యాణ్‌నగర్, మేదరిబస్తీ తదితర ప్రాంతాల్లో తారు రోడ్డు నిర్మాణానికి రెండు ప్యాకేజీల్లో టెండరు నిర్వహించగా అదే గుత్తేదార్లతో వచ్చినంత దూరం తారు రోడ్డుకు బదులుగా సిమెంటు రోడ్డు వేయించాలని నగరపాలిక భావిస్తోంది. నగరపాలిక అధికారులు విద్యుత్తు స్తంభాలను తరలిస్తేనే రోడ్డు నిర్మాణం పనులు మొదలయ్యే అవకాశముంది. నగరపాలకవర్గం, అధికారులు యుద్ధప్రాతిపదికన గోతులమయమైన కల్యాణ్‌నగర్ రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రహదారి నిర్మాణంలో జాప్యంగోతులమయమైన రోడ్డుతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వ్యాపారు లతో పాటు స్థానిక కార్పొరేటర్లు ఆందోళన చేపట్టారు. స్పందించిన నగరపాలిక సుమారు రూ.3.2 కోట్లతో రెండు ప్యాకేజీల్లో రోడ్డు నిర్మాణానికి టెండరు నిర్వహించి గుత్తేదారుకు పనులు అప్పగించారు. రోడ్డు వేసే ముందు భూగర్భ మురుగు కాలువ సమస్యను పరిష్కరించాలంటూ విజ్ఞప్తులు పెరగడంతో మరో రూ.50 లక్షలతో మేదరిబస్తీ మూలమలుపు నుంచి కల్యాణ్‌నగర్ కూడలి వరకు భూగర్భ మురుగు కాలువ నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో మురుగు సమస్య పరిష్కారమైనప్పటికీ రోడ్డు సమస్య తీవ్రమైంది. భూగర్భ మురుగు కాలువ పైపులు వేసేందుకు తవ్విన రోడ్డు మరింత గోతులమ యమైంది. తక్షణమే రోడ్డు వేయాలని స్థానికులు కోరుతుండగా తారు రోడ్డుకు బదులుగా సిమెంటు రోడ్డు వేయాలనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి.

# పర్యావరణ హితం.. పోషకాలు భద్రం

గోదావరిఖని : కూలీల కొరతతో కొన్నేళ్లుగా రైతులు యంత్రాలతోనే వరి నూర్పిడి పనులు చేస్తున్నారు. పంట కోసిన తర్వాత మిగిలిన కొయలకు, గడ్డికి నిప్పంటిస్తుండటంతో పర్యావరణ కాలుష్యంతో పాటు సూక్ష్మ పోషకాలు అంతరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంథనికి చెందిన యువ రైతు పాలకుర్తి సత్యనారాయణ పొలంలో గడ్డిని, కొయ్యలను కాల్చకుండా ప్రత్యేక పరికరంతో సేంద్రియ ఎరువుగా మార్చుకున్నారు.

పట్టణానికి చెందిన సత్యనారాయణ తనకున్న 6 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వరి కోసిన తర్వాత కొయ్యలను, మిగిలిన గడ్డిని కాలబెట్టకుండా పొలంలో కలిసిపోయేందుకు ఏదైనా అవకాశం దొరుకుతుందా? అని అనేక ప్రాంతాల్లో శోధించారు. రెండేళ్ల కిందట కర్ణాటకలో రూ.70 వేలకు 'ప్యాడీ స్లాషర్' అనే యంత్రాన్ని కొనుగోలు చేశారు. ఈ యంత్రం సాయంతో పొలంలో మిగిలిన వరి కొయ్యలను తుక్కుగా చేస్తున్నారు. అనంతరం నీరు పెడుతున్నారు. రొటోవేటర్‌తో దున్నుతుండటంతో నేలలో త్వరగా కలిసిపోతోంది. అనంతరం కంపోస్టు తయారయ్యేలా ఎకరానికి ఒక బస్తా సూపర్ ఫాస్పేట్ గుళికలు వేస్తున్నారు. దీంతో వారం రోజుల్లో కుళ్లి భూసారంతో పాటు పంటల దిగుబడి పెరిగింది.

పొలంలో చౌడు శాతం తగ్గింది

'అన్నదాత' ద్వారా యంత్రం గురించి తెలుసుకున్నాను. ప్యాడీ స్లాషర్ వాడకంతో సూక్ష్మ పోషకాలకు ఎలాంటి హాని ఉండదు. చౌడు



భూముల్లో రెండేళ్ల పాటు ఈ యంత్రాన్ని ఉపయోగిస్తుండటంతో చౌడు శాతం కూడా తగ్గింది. ఈ పద్ధతిపై ఇతర రైతులకు అవగాహన కల్పిస్తున్నా. ఎకరాకు 5 నుంచి 10 బస్తాల దిగుబడులు అధికంగా వస్తున్నాయి.

పాలకుర్తి సత్యనారాయణ, రైతు

# వెలవెలబోతున్న చెరువులు.. అడుగంటుతున్న ఆశలు!

సత్తుపల్లి : గతేడాదితో పోలిస్తే ఈసారి ఆశించిన స్థాయిలో వర్షాలు లేక, సాగర్ నీరురాక జిల్లాలోని జలాశయాల్లో అత్యధికం వెలవెలబోతున్నాయి. దీని ప్రభావంతో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయి. రబీ వరిసాగు గణనీయంగా తగ్గిపోయింది. ఈనేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, లేదంటే పంట విరామం ప్రకటించాలని అధికారులు సూచిస్తున్నారు. కొన్నిచోట్ల అన్నదాతలు వరి నార్లు పోసుకున్నారు. నాట్లు వేసినా పంట చివరి దశలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఖమ్మం జిల్లాలో..

పాలేరు, ఖమ్మం, వైరా, కల్లూరు, సత్తుపల్లి, మధిర డివిజన్లలో 983 చెరువులు, కుంటలు ఉండగా ఎక్కడా వంద శాతం నీరు లేదు. ప్రాజెక్టులు, పెద్ద చెరువుల్లో ఆశాజనకంగా ఉంది. 182 జలాశయాల్లో 0–25 శాతం, 458లో 25–50, 282లో 50–75, 48లో 75–100శాతం నీరుంది. సాగర్ జలాల విడుదలలో జోన్–2, జోన్–3లకు సాగు, తాగునీరు సరఫరా కావాల్సి ఉండగా వర్షాభావంతో ఆయా జోన్‌లలో కేవలం ఖరీఫ్ పంటల సాగుకు అరకొరగానే సరిపోయాయి. వేసవి నేపథ్యంలో రెండో పంటకు ఎలాగూ నీరు వచ్చే పరిస్థితి లేదు. కనీసం తాగటానికి వినియోగించేందుకు సాగర్



జలాలు వస్తాయో లేదోననే సందేహం వ్యక్తమవుతోంది.

నిల్వల పరిరక్షణ ఆవశ్యకత

రోజురోజుకూ నీటి నిల్వలు తరిగిపోతున్న నేపథ్యంలో ఇప్పటికే పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు నీటిని సంరక్షించుకోకపోతే పశుపక్షాదులు, జలచరాలు కూడా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. తగినంత నీరు లేకపోవడంతో చెరువులనే నమ్ముకున్న మత్స్యకారులు సైతం ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అరకొర నీరున్న చెరువులు, కుంటలు ఎండాకాలంలో అడుగంటే అవకాశం ఉంది. కొందరు రైతులు జలాశయాలకు మోటార్లు ఏర్పాటు చేసి పంటలు సాగు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అధికారులు దిశానిర్దేశం చేయాల్సిన అవసరముంది.

పొదుపుగా వాడుకోవాలి

ఆనంద్‌కుమార్, ఎస్‌ఈ, జలవనరులశాఖ, కల్లూరు

జిల్లాలోని చెరువులు, కుంటల్లో ఉన్న నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలి. పశుపక్షాదులకు నీరు అందేలా గ్రామాల్లోని రైతులంతా సమష్టిగా నిర్ణయాలు తీసుకోవాలి.

"పెనుబల్లి మండలం మధ్యతరహా నీటి ప్రాజెక్టు లంకాసాగర్‌లో 13 అడుగుల నీటి మట్టం ఉంది. పూర్తిస్థాయి నీటి మట్టం 16 అడుగులు కాగా 7,350 ఎకరాల ఆయకట్టుంది. అధికారులు ఆరుతడి పంటలే వేసుకోవాలని, లేదంటే పంట విరామం ప్రకటించాలని సూచించగా రైతులు మాత్రం వరి నార్లు పోసుకున్నారు. ప్రాజెక్టులో చేపలున్నందున 7 అడుగుల వరకే నీటిని వినియోగించునే అవకాశం ఉంది. దీని ప్రకారం ఉన్ననీరు నాట్ల వరకే సరిపోతుంది. పూర్తి ఆయకట్టులో వరినాట్లు వేస్తే రైతులు నష్టపోయే ప్రమాదముంది."

# బస చేయాలంటేనే భయం!

చేర్యాల: కొమురవెల్లి మల్లికార్జునస్వామిని కొలిచేందుకు వచ్చే భక్తులకు ఆలయం వద్ద తిప్పలు తప్పడం లేదు. రూ.18కోట్ల వార్షిక ఆదాయం ఉన్నా మెరుగైన సౌకర్యాల కల్పనలో ఆలయ వర్గాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. నీటి, వసతి మొదలుకొని, కనీసం నిలువ నీడ కల్పించలేక పోతున్నారు. ముఖ్యంగా వసతి గృహాలకు మరమ్మతులు చేయించాలన్న ధ్యాస లేకపోవడంతో ఆలయ వర్గాలు విమర్శల పాలవుతున్నాయి. అధికారుల వర్గ విభేదాల కారణంగా భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

అధ్వానంగా నిర్వహణ ఏటా మల్లన్న దర్శనానికి సుమారు 25 లక్షల మంది భక్తులు వస్తారు. అందులో సంక్రాంతి నుంచి ఉగాది పండుగ వరకు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో రద్దీ విపరీతంగా ఉంటుంది. వారికి కనీసం నిలువ నీడ కల్పించలేని దుస్థితి ఉంది. అరకొరగా కాటేజీలు ఉన్నాయి. అవి కూడా భక్తులు నిర్మించినవే. అందులో సరిగా బిగించని తలుపులు, అద్దాలు పగిలిన కిటికీల తలుపులు, నీటి కటకట తదితర అసౌకర్యాలు ఆలయ వర్గాల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. పైకప్పు పెచ్చులూడి కిందపడుతున్నాయి. రెండేళ్ల క్రితం కరీంనగర్, జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కి చెందిన ముగ్గురు భక్తులకు గాయాలయ్యాయి. తలపై పడుతున్నట్లు గుర్తించి చేయి అడ్డుపెట్టగా భక్తుడి చేతికి గాయమైంది. కాటేజీలకు చేరుకొనే మెట్లు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. శిథిలావస్థకు చేరుకున్నా మరమ్మతులు చేయించడం లేదు. గతంలో పలుమార్లు దొంగతనాలు కూడా జరిగాయి.

భారీగానే వసూళ్లు!దాతలు నిర్మించిన కాటేజీల నిర్వహణ పేరుతో ఆలయం వారు డబ్బులు దండిగానే వసూలు చేస్తున్నారు. రెండు గదులున్న కాటేజీకి రోజుకు రూ.900, ఒక గదికి రోజుకు రూ.600లు తీసుకుంటున్నారు. ఈ డబ్బులతో అవసరమైన మరమ్మతులు చేయాలి. కానీ ఏళ్లుగా పట్టించుకోవడం లేదు. కొన్ని కాటేజీల్లో కనీసం కూర్చోవడానికి కూడా వసతులు లేవు. మరోవైపు ఏటా స్వామివారి కల్యాణోత్సవానికి కొనుగోలు చేసే పరుపులు, కుర్చీలు మాయమవుతున్నాయి. అవి ఆలయ అధికారులు, సిబ్బంది ఇళ్లలోకి చేరుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇక కాటేజీల్లో, క్యూలైన్లలోని శౌచాలయాలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసనతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కార్యాలయంలో ఫిర్యాదు చేసినా బాగు చేయించడం లేదని వాపోతున్నారు. ఒకసారి ఆలయ అధికారులు, పాలకవర్గం ఛైర్మన్, సభ్యులు క్యూలైన్లలో తిరిగితే మా బాధలు తెలుస్తాయని అంటున్నారు.సగానికి పైగా.. భక్తులు నిర్మించి, ఆలయానికి అప్పగించిన కాటేజీలు మొత్తం 147 ఉన్నాయి. కేతమ్మ బ్లాక్‌లో 76, మల్లికార్జున బ్లాక్‌లో 21, మేడలమ్మ బ్లాక్‌లో 50 గదులున్నాయి. ఇందులో 42 కాటేజీలు రెండు గదులున్నవి. మిగిలిన 105 ఒకే గదివి. వేములవాడ, శ్రీశైలం దేవాలయాలు రూ.50లక్షలతో నిర్మించిన రెండు అతిథి గృహాల్లో పోలీసుస్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలు కొనసాగుతున్నాయి. వీటిలో అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సినవి సగానికిపైగా ఉన్నాయి. జాతర ప్రారంభమయ్యే లోపు వాటికి మరమ్మతులు చేస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు.ప్రతిపాదనలు తయారు చేయిస్తాం: ఎ.బాలాజీ, ఈవో

# అన్నదాత చూపు ఆకాశం వైపు

పెద్దపల్లి : వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ తొలకరి చినుకు కరవైంది. ఆకాశం వైపు అన్నదాత చూసే పరిస్థితి నెలకొంది. విత్తులు నాటేందుకు దుక్కులు సిద్ధం చేసిన రైతులు నిరీక్షిస్తున్నారు. మృగశిర కార్తె నడుస్తున్నప్పటికీ రుతుపవనాల జాడ లేదు. గతంలో ఎన్నడు లేనివిధంగా జూన్ మూడో వారంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదు కాలేదు. వరుణుడుపై ఆశలు పెట్టుకున్న కొందరు రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరగడంతో విత్తనాలు మాడిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి గట్టెక్కించేందుకు ఈ ఏడాది వ్యవసాయ శాఖ సాగు కాలాన్ని ముందుకు తీసుకెళ్లాలని భావిస్తోంది.

2.83 లక్షల ఎకరాల సాగు లక్ష్యం

జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 2.83 లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు కానుందని అంచనా వేశారు. ఇందులో 2.13 లక్షల ఎకరాల్లో వరి, 65 వేల ఎకరాల్లో పత్తి పంటలు సాగు కానున్నాయని వ్యవసాయ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గతేడాది 81,270 ఎకరాల్లో పత్తి అంచనా వేయగా భారీ వర్షాలతో కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నీటిలో పత్తి పంట మునగడంతో 64 వేల ఎకరాలకు పరిమితమైంది. జిల్లాలో ప్రధాన నీటి వనరులైన ఎస్సారెస్పీ నీరుపైనే ఆధార పడాల్సి వస్తోంది.

వర్షపాతం లోటు

జిల్లాలో గడిచిన రెండేళ్లలో గణాంకాలు పరిశీలిస్తే వర్షపాతం లోటు కనిపిసోంది. ఈ ఏడాదిలో మొత్తం 1035.8 మి.మీ. వర్షాపాతం అంచనా ఉంది. జూన్‌లో 91.5 మి.మీ. సాధారణ వర్షపాతం ఉ ండగా ఇప్పటి వరకు 4.5 మి.మీ. మాత్రమే నమోదైంది. గతేడాది ఇదే నెలలో 72.5 మి.మీ. వర్షం కురిసింది. మూడో వారం నడుస్తున్నా.. వర్షం కురియకపోవడంతో పంటల సాగుపై సందిగ్ధం నెలకొంది. వాతావరణ శాఖ ఐదేళ్లకోసారి సాధారణ వర్షపాతం లెక్కించగా ప్రస్తుతం 30 ఏళ్లకు పొడిగించారు.

పది వేల ఎకరాలకు పైనే పత్తి

జిల్లాలో ఇప్పటి వరకు పది వేల ఎకరాల్లోనే పత్తి సాగు చేశారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దుక్కులు సిద్ధం చేసుకుని వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. పెరుగుతున్న ఎండలతో పత్తి విత్తనాలు మాడిపోవడంతో రైతులు కలవరపడుతున్నారు. మరోవైపు బోర్ల కింద వరి నార్లు పోసేందుకు సమాయత్తమవుతున్నారు. వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించింది. ఏ రకమైన పంటలు వేస్తే రైతులకు లాభసాటిగా ఉంటుందనే కోణంలో పరిశీలిస్తున్నారు.

# ఆధునిక హంగులతో కూరగాయల మార్కెట్

వేములవాడ : ఆధ్యాత్మిక కేంద్రమైన వేములవాడ పట్టణంలో కూరగాయల రైతులు, వినియోగదారులకు సౌకర్యంగా ఉండే విధంగా ఆధునిక హంగులతో కూరగాయల మార్కెట్ నిర్మించారు. ఇది పూర్తి కావడంతో ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఎప్పటి నుంచో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, వినియోగదారులకు కష్టాలు తీరనున్నాయి.

పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ముందు శామకుంటలో రూ. 2.7 కోట్ల మున్సిపల్ నిధులతో అధునాతన వసతులతో సమీకృత (ఇంటిగ్రేటేడ్) మార్కెట్ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవానికి మున్సిపల్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు పట్టణంలో సరైన కూరగాయల మార్కెట్ లేక పట్టణ ప్రజలు, కూరగాయల వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రత్యేక చొరవతో శామకుంట, మార్కెట్ యార్డులో రెండు మార్కెట్లను ఆధునిక హంగులతో నిర్మాణానికి సంకల్పించారు. వేములవాడ పట్టణం చుట్టు పక్కల గ్రామాలతో పాటు బోయినపల్లి, కోనరావుపేట, చందుర్తి తదితర ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకువచ్చే రైతులకు సైతం సరైన మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పట్టణంలోని తెలంగాణ కూడలి వద్ద, రెండో బైపాస్ రోడ్డులోని గంగమ్మ గుడి వద్ద కూరగాయల మార్కెట్లు రహదారుల పక్కన అసౌకర్యాల మధ్య నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూరగాయల మార్కెట్‌కు సరైన స్థలం లేక రైతులు, విక్రయదారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శామకుంటలో రూపుదిద్దుకున్న సమీకృత కూరగాయల మార్కెట్‌ను ప్రారంభిస్తే ఇక పట్టణంలోని రోడ్లపై క్రయ, విక్రయాల సమస్య శాశ్వతంగా తొలగిపోనుంది.

ఉపయోగంగా...

పట్టణంలోని శామకుంట కూరగాయల మార్కెట్‌ను అన్ని హంగులతో



నిర్మించారు. కూరగాయలకు సంబంధించి గ్రౌండ్ ఫ్లోర్‌లో 51, పైఅంతస్తులో 51 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో కూరగాయలతో పాటు పండ్లు విక్రయ దుకాణాల స్టాల్స్ నిర్మించారు. మొదటి అంతస్తులో కూరగాయలు, పండ్లు నిల్వ చేసేందుకు కోల్డు స్టోరేజ్ కట్టారు. అన్ని రకాల కూరగాయలు, పండ్లు ఇక్కడ లభించేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు. విక్రయదారులకు ఇబ్బందులు లేకుండా ప్లాట్‌ఫారాలు నిర్మించారు. కూరగాయలు నిల్వ చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ ప్రజలకు వివిధ రకాల కూరగాయలు, పండ్లు ఈ మార్కెట్‌తో అందుబాటులోకి రానున్నాయి. పట్టణం మధ్యలో మార్కెట్ ఉండటంతో ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండనుంది.

ప్రారంభోత్సవానికి సిద్ధం చేశాం- అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

పట్టణంలోని శ్యామకుంటలో కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేశాం. ఇందులో రైతులు, వినియోగదారులకు అన్ని సౌకర్యాలు ఉండే విధంగా నిర్మాణం పూర్తయింది. ఈ కూరగాయల మార్కెట్ ప్రారంభిస్తే రోడ్లపై క్రయ, విక్రయాలు చేసే రైతులకు, వినియోగదారుల ఇబ్బందులు పూర్తిగా తొలగనున్నాయి. త్వరలోనే ఈ మార్కెట్‌తో పాటు పూర్తయిన పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తాం.

# అసంపూర్తిగా అభివృద్ధి పనులు



జనగామ : జనగామ పట్టణంలో మున్సిపాల్టీ పరిధిలో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధులున్నా పూర్తి కానివి కొన్ని, ప్రతిపాదనలకే పరిమితమైనవి మరికొన్ని. పట్టణ సుందరీకరణ, అభివృద్ధి కోసం వివిధ పథకాల కింద నిధులు మంజూరైనా సకాలంలో పనులు పూర్తి కావడం లేదు.

సుందరీకరణ పనులు ఇలా..స్థానిక రోడ్డు ఓవర్ బ్రిడ్జి కింద ఖాళీ స్థలాన్ని సమీప ప్రాంతాల వారు వివిధ వ్యాపార సామగ్రిని నిల్వ చేసేందుకు వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం వారధి కింద జన సంచారం లేకుండా చూడాల్సి ఉంది. గతంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి వారధి కింద పచ్చదనం, పరిశుభ్రతకు గార్డెనింగ్ పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. నాలుగేళ్ల క్రితం ఆయన చేసిన ప్రతిపాదనకు గతేడాది కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ.10 లక్షలతో నాగులకుంట నుంచి రైల్వే పాతగేటు వరకు గార్డెనింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆరు మాసాల క్రితం పనులు చేపట్టారు. ఒక వైపు సిమెంటు రెయిలింగ్ నిర్మించారు. మొక్కలు నాటేందుకు, పచ్చదనం పెంపునకు మట్టిపోసి వదిలేశారు. మరోవైపు రెయిలింగ్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. నిధులు లేవంటూ పనులను అసంపూర్తిగా వదిలేశారు. సీపీఐ కార్యాలయం పక్కన వారధి వెంట రహదారి నిర్మాణం పూర్తయితే ఇరువైపులా రద్దీని నివారించవచ్చు. మట్టిపోసి వదిలేయడంతో పరిస్థితి మొదటికి వచ్చింది. లిపనులను పూర్తి చేసేందుకు మరో రూ.10 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మిగులు పనులకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధాన రహదారి వెంట కాల్వ పనులు చేస్తున్న గుత్తేదారు ఈ పనిని పూర్తి చేయాల్సి ఉంది. కాల్వ పనుల్లో తలమున కలైనందున ఇక్కడ పనులు జరగలేదంటున్నారు.

నెలల తరబడి జాప్యం

స్థానిక ప్రధాన రహదారుల వెంట ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థలోని స్తంభాలు కొన్ని చోట్ల కూలిపోయాయి. హైదరాబాద్ రహదారిలో మూడు చోట్ల, సిద్దిపేట రహదారిలో రెండు చోట్ల కూలిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు మూడు మాసాల క్రితం కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ.లక్షతో చేపట్టే పనులు సైతం జరగడం లేదు. హైదరాబాద్ రహదారి వెంట విభాగిని నిర్మాణం పూర్తి కాకముందే స్తంభాలు, దీపాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. లిస్థానిక వాసవి కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. సంజయ్‌నగర్‌లో కూడలి అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీవర్స్‌కాలనీ పెద్ద కల్వర్టు అనుసంధాన రహదారి పనులను ప్రారంభించి వదిలేశారు. రూ.6.50 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ పనుల్లో భాగంగా నిర్మించాల్సిన పూలు, పండ్ల మార్కెట్ పనులు పునాదిదశలో ఉన్నాయి. రూ.కోటి వ్యయంతో చేపట్టిన మోడల్ వైకుంఠధామం పనులదీ అదే పరిస్థితి. చౌరస్తా నుంచి హౌసింగ్ బోర్డు వరకు విభాగిని నిర్మాణం మిగిలి ఉంది. హౌసింగ్ బోర్డు నుంచి పెంబర్తి బైపాస్ రోడ్డు వరకు విభాగిని నిర్మాణ పనుల్లో మరో 40 శాతం మేర పూర్తి కావాల్సి ఉంది. 10, 11 వార్డుల పరిధిలో మురుగుకాల్వ నిర్మాణ పనులు ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. గుండ్లగడ్డ చిన్నమోరి మురుగునీటి మళ్లింపు ప్రతిపాదన దశను దాటడం లేదు.

టెండరు పూర్తయినా..

రూ.2 కోట్లతో నిర్మించాల్సిన ఆధునిక దోబీఘాట్ నిర్మాణానికి స్థల సేకరణ, టెండర్ల ప్రక్రియ పూర్తయింది. పనుల ప్రారంభానికి ముహూర్తం ఖరారు కాలేదు. స్థానిక తపాలా కార్యాలయం కూడలిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద రహదారి అభివృద్ధి పనులు పెండింగులోనే ఉన్నాయి. రూ.40 లక్షలతో నిర్మించాల్సిన రాత్రి బస భవన నిర్మాణానికి పునాది రాయే పడలేదు. పట్టణ ప్రగతి నిధులు సకాలంలో రాకపోవడంతో అనేక ప్రతిపాదనలు ముందుకు కదలడం లేదు.

సమీక్షించి పనులు జరిగేలా చూస్తాం

– డీఈ చంద్రమౌళి

విభాగిని పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. సెంట్రల్ లైటింగ్ విద్యుత్తు స్తంభాల ఏర్పాటు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఆర్వోబీ కింద పచ్చదనం పెంపు పనులకు టెండర్లు పూర్తయ్యాయి. నిధుల లభ్యతను అనుసరించి, అసంపూర్తి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

# చెక్‌డ్యాం నిర్మిస్తేనే నీరు నిలిచేది!




మహబూబాబాద్ : పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లి పాలేరు వాగుపై చెక్‌డ్యాం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 2019-20లో రూ.2.7 కోట్ల నిధులతో నిర్మాణానికి సర్కారు అనుమతి ఇచ్చింది. ఎప్పుడో పూర్తి చేయాల్సిన వారు..ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించారు. ఈ పనుల్ని తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలి. ప్రస్తుతం జరుగుతున్న పనుల్ని చూస్తుంటే ఈ మధ్యలోనే విస్తారంగా వానలు కురిస్తే నిలిచిపోనున్నాయి. మరల వచ్చే వేసవిలోనే పూర్తి అయ్యేలా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితే ఎదురైతే ఆ ప్రాంతంలో ఉ ట్టిపడే జలకళను చూడాలనుకుంటున్న ఆయకట్టు రైతులకు ఎదురుచూపులే మిగలనున్నాయి.జిల్లాలోని పాలేరు, ఆకేరు, మున్నేరు, పాకాల, వట్టి వాగులు ప్రవహి స్తున్నాయి. వీటిలో ఎల్లప్పుడూ జలకళ ఉట్టిపడేలా..ఆయకట్టు సాగునీరందేలా.. భూగర్భజలాలు పెంపొందేలా చెక్‌డ్యాం నిర్మాణానికి సర్కారు ప్రాధాన్యమిచ్చింది. 2019-20లో జిల్లాలోని వాగులపై 38 చెక్‌డ్యాంల నిర్మాణాలకు సుమారు రూ. 117 కోట్ల నిధులతో అనుమతులిచ్చింది. ఇందులో ఇరవై నిర్మాణాలకు నాబార్డు వారి సహకారాన్ని తీసుకున్నారు. ఏడాదిలోనే ముగించాల్సిన పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్ని చోట్ల ప్రారంభించలేదు. రెండేళ్లుగా వానాకాలంలో భారీ వర్షాలు కురవడంతో చాలా చోట్ల నీరు నిల్వ ఉండడంతో పనులు చేయడానికి వీలు పడలేదు. వరదలకు కొన్ని చోట్ల కోతకు గురికాగా నీటిని మళ్లించి మరమ్మతులు చేశారు. పూర్తికానివి, పనులు ప్రారంభించినవి ఈ వేసవిలోనైనా చేస్తారని భావించినా ముందడుగు పడలేదు.

పురోగతిలో ఉన్నట్లుగా..38 చెక్ డ్యాంల్లో 22 నిర్మాణాలు పూర్తైనట్లు మరో 16 పురోగతిలో ఉన్నట్లు ఆ శాఖ అధికారులు ఏప్రిల్‌లో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశపు ఎజెండా నివేదికలో పొందుపరిచారు. ఆ రికార్డు ప్రకారం వాటిని నిర్మాణం చేయాల్సిన చోట పనులే మొదలు కాలేదు. తొర్రూరు మండలంలో 8 చోట్ల నిర్మించాలనుకున్నారు. ఇందులో ఆరు మాత్రమే పూర్తయ్యాయి. చీకటాయపాలెం, కంటాయ పాలెం గ్రామంలో పనులు ప్రారంభం కాలేదు. కంటాయపాలెంలో రూ.5.9 కోట్లతో 425 ఎకరాల ఆయకట్టు సాగునీరిందేలా నిర్మించాలి. పెద్దవృగరలో రెండింటిలో ఒకటి పూర్తికాగా..మరొకటి ఏప్రిల్‌లో మొదలు పెట్టారు. ఇంకా పూర్తి కాలేదు. ఈ మధ్యలో వర్షాలు కురిస్తే వరదతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోనున్నాయి. కేసముద్రం, గూడూరు మండలాల్లోనూ ఎంపిక చేసిన పనుల్లో సగం వరకు పురోగతిలోనే ఉన్నాయి.

ఇది తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామంలోని పాలేరు వాగు. ఇందులోని వరదనీటికి అడ్డుకట్ట వేసేందుకు 2019-20 ఆర్థిక సంవత్సరంలో చెక్‌డ్యాం నిర్మించేందుకు రూ.3.966 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఆయకట్టు 350 ఎకరాలకు సాగునీరందేలా.. సమీపంలోని బోర్లు, బావుల్లో భూగర్భజలాలు వృద్ధి చెందేలా చెక్‌డ్యాం నిర్మించాలనుకున్నారు. సుమారు నాలుగేళ్లు కావొస్తున్నా ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు. ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతన్నలకు నిరాశే మిగిలింది.హడావుడిగా చేస్తే అంతే!ప్రస్తుతం చేస్తున్న పనులను వర్షాలు వస్తాయని హడావుడిగా చేస్తే నాణ్యత లోపించి విరివిగా వర్షాలు కురిస్తే చెక్‌డ్యాంలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. గుర్తూరు ఆకేరు వాగులో నిర్మించిన చెక్‌డ్యాం ప్రణాళిక ప్రకారం చేపట్టకపోవడంతో ఆశించిన స్థాయిలో నీరు నిల్వడం లేదని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొన్ని చోట్ల నిర్మాణాలకు ఆలస్యమైంది. పనుల్ని నాణ్యతతో చేపడితే పదికాలాల పాటు మన్నికతో ఉంటాయి. ఇందుకు క్షేత్రస్థాయిలో సంబంధిత జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు దగ్గరుండి పనులు చేయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సారు.. లేరు!

కొత్తగూడెం : ప్రభుత్వ విద్యాలయాలు ప్రారంభమయ్యాయి. ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ కొనసాగుతోంది. రాత పుస్తకాలు సైతం అందజేయనున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా... ఉభయ జిల్లాల్లోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరే దారి కనిపించడం లేదు. గత ఐదేళ్లుగా ఎలాంటి నియామకాలు చేపట్టకపోవడంతో ఈ సమస్య ఎదురైంది. దీంతో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ప్రభావం పడుతోందని 'న్యాస్', 'ప్రథమ్', 'అసర్' వంటి నివేదికలు ఇప్పటికే వెల్లడించాయి. పలువురు విద్యార్థులు కనీసం రాయడం, చదవడంలో తడబడగా.. గణిత చతుర్విధ (కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగాహారం) ప్రక్రియల్లో బాగా వెనుకబడినట్లు సర్వేల్లో తేలింది. గతంలో ఖాళీలున్న చోట వాలంటీర్లతో తరగతులు నెట్టుకొచ్చేవారు. 2019-20 సంవత్సరం నుంచి ప్రభుత్వం వీరినీ పక్కనపెట్టింది. ప్రస్తుతం సర్కారు బడుల్లో తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమాన్నీ ప్రవేశపెట్టారు. కానీ తరగతుల బోధనకు సంబంధించి విద్యార్థుల సంఖ్యకు తగినవిధంగా ఉపాధ్యాయుల్లేరు. జిల్లా స్థాయిల్లో చేపట్టదలచిన సర్దుబాటు ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. అప్పటిదాకా ఉన్నవారితోనే




ఎలాగోలా తరగతులు నెట్టుకొచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

'ఉభయ జిల్లాల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. సబ్జెక్టు టీచర్లు లేనిచోట సమీప పాఠశాలల్లో అదనంగా ఉన్నవారిని సర్దుబాటు చేస్తున్నాం. ఇందుకోసం కలెక్టర్ల అనుమతి లభించింది. త్వరలో ప్రక్రియ పూర్తిచేస్తాం. ఏకోపాధ్యాయ పాఠశాలలతో పాటు భద్రాద్రిలో ఒక్కరూ లేని ప్రభుత్వ బడులకు ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేస్తాం. ఏ ఒక్క పాఠశాల మూతపడనివ్వం. సోమశేఖరశర్మ, డీఈఓ

# నాలుగేళ్లుగా.. ఎదురుచూపులేగా..!

సూర్యాపేట : గత పదేళ్లుగా ఆయకట్టుతో పాటు ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల బావులు, బోర్లతో వ్యవసాయానికి సాగునీరు అందిస్తున్నారు. 2001-02లో వచ్చిన కరవు తర్వాత ఆయకట్టులో 70 శాతం మంది రైతులు బోర్లు, బావులు తవ్వించారు. వీటికి మోటార్లు ఏర్పాటు చేసుకుని కొద్ది కమతంలో పంటలు పండిస్తున్నారు. ఒక వ్యవసాయ విద్యుత్తు సర్వీసు మంజూరు కావాలంటే ముగ్గురు లేదంటే నలుగురు రైతులు డీడీలు చెల్లించాలి. ఒక్కో డీడీ ప్రస్తుతం రూ.58 00లు (గతంలో రూ.4960 ఉండేది) చెల్లించాలి. ఒక్క డీడీ చెల్లిస్తే ప్రభుత్వం ఒక్క డీడీకి రూ.70 వేల రాయితీ ఇస్తుంది. ఇలా మూడు డీడీలకు రూ.2,10,000 ప్రభుత్వం నుంచి రాయితీ రూపంలో విద్యుత్తు శాఖకు అందుతుంది. ఆ డబ్బుతో రైతులకు ఒక విద్యుత్తు నియంత్రిక, ఒక డీపీ స్తంభం, ఏబీ స్విచ్, ఎస్‌జీ ఫ్యూజు, దిమ్మె, కూలీల ఖర్చు, ఎర్త్ తదితర సామగ్రి సమకూర్చుతారు. నాలుగు డీడీలు చెల్లిస్తే నియంత్రికతో పాటు అదనంగా 5 స్తంభాల మేర లైను వస్తుంది. రైతులు ఎక్కువగా నాలుగు డీడీలు చెల్లిస్తుంటారు. ఏటేటా రైతుల అవసరాలు పెరుగుతుండటంతో తదనుగుణంగా సర్వీసులు మంజూరు ఇవ్వడం లేదు. కొంతమంది రైతులు నాలుగేళ్ల క్రితం డీడీలు చెల్లించి నేటికి సర్వీసు మంజూరు, లైన్ ఏర్పాటుకు ఎదురుచూస్తున్నారు.

సకాలంలో మంజూరు ఇస్తే..

రైతులు డీడీలు చెల్లించిన వెంటనే మంజూరు ఇచ్చి నియంత్రిక ఏర్పాటు, లైన్లు వేయడం పూర్తి చేస్తే పెరిగిన భారం పడేది కాదు. ప్రభుత్వం జాప్యం చేయడంతో అది నాలుగేళ్ల తర్వాత రైతులపై పడుతుంది. సకాలంలో డీడీలు చెల్లించినా భారం పడటం అన్యాయ మని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓఆర్సీ్మ చెల్లించినా కొంతమ ందికి మంజూరు రావడం లేదు. గరిడేపల్లిలో కొంతమంది రైతులు రూ.2.62 లక్షలు ఓఆర్సీ్మ చెల్లించారు. అయినా పనులు చేయడానికి రెండు నెలలుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వస్తుంది. ఇలా ఉమ్మడి జిల్లాలో పది వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

ఓఆర్సీ్మ చెల్లించి రెండు నెలలు

మేము కొంతమంది రైతులం కలిసి 2019 సెప్టెంబరు 24న ముగ్గురం ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు, నలుగురం మరో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏడు డీడీలు తీశాం. 2023 ఏప్రిల్‌లో రూ.2.62 లక్షలు ఓఆర్సీ్మ కట్టాలని అధికారులు చెప్పారు. యాసంగి పంట చేతికి రావడంతో అప్పులు పోగా మిగిలిన సొమ్మును వానాకాలం పెట్టుబడికి ఉంచుకుందామ నుకున్నా.. అందరు కరెంటు కోసం డబ్బులు కట్టాలంటే ఓఆర్సీ్మ కింద ఏప్రిల్ 17న చెల్లించాం. నియంత్రిక, స్తంభాలు వేయండని అధికారులను అడిగితే టెండర్ పిలవాలని చెబుతున్నారు. సీ్మజన్ వచ్చింది. నారుమడికైనా నీరు పెట్టుకుందామంటే మోటారుకు విద్యుత్తు లేదు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే లైను, నియంత్రిక ఏర్పాటు చేయండి.

బండ వెంకటరెడ్డి. గరిడేపల్లి

వారంలో టెండర్ పూర్తి చేస్తాం


ఓఆర్సీ ఎక్కువ ఉంటే టెండర్ పిలవాల్సి ఉంటుంది. టెండర్‌కు నోటీసు బోర్డుపై పెడుతున్నాం. వారంలో పూర్తి చేస్తాం. వెంటనే లైన్ వేయిస్తాం .వెంకటకృష్ణయ్య, డీఈ హుజూర్‌నగర్.

రైతులపై పెరిగిన భారం

రైతులు చెల్లించిన డీడీలకు ప్రభుత్వం ఎప్పటి నుంచో రూ.70 వేల రాయితీ ఇస్తుంది. 2016-17 సంవత్సరం నుంచి నియంత్రికలు, కరెంటు సామగ్రి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. 2018-19లో రూ.75 వేలు ఉన్న 25 కేవీ విద్యుత్తు నియంత్రిక ప్రస్తుతం రూ.1.20 లక్షలు అయింది. ప్రభుత్వం రాయితీ పెంచలేదు. కేవలం రూ.70 వేలు ఇస్తుంది. పెరిగిన 30 శాతం ధరాభారం రైతులపైనే పడుతోంది. ఒక్క నియంత్రిక ధరలోనే రూ.45 వేలు రైతుల చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక ఏబీ స్విచ్ ధర గతంలో రూ.6 వేలు ఉండగా ఇప్పుడు రూ.13 వేలకు పెరిగింది. అంటే రైతుపై ఏడు వేల భారం పడినట్లే. రాయితీ రూ.లక్షకు పెంచితే రైతుపై ఇంత భారం పడదు. పెరిగిన ధరలను ఓఆర్సీ్మ పేరుతో విద్యుత్తు శాఖ వసూలు చేస్తుంది.ోఓఆర్సీ్మ చెల్లిస్తేనే లైను వేయడం, సర్వీసు మంజూరు చేయడం చేస్తున్నారు. ఇలా ఓఆర్సీ్మ చెల్లించిన రైతులు దాదాపు 80 శాతం మంది ఉన్నట్లు విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు.వ్యవసాయ విద్యుత్తు సర్వీసుల కోసం రైతులు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నా.. మోక్షం కల్గడం లేదు. డీడీలు చెల్లించి కార్యాలయాల చుట్టూ తిరిగినా కనికరం చూపడం లేదు. ఈ లోగా నియంత్రికలు, కరెంటు సామగ్రి ధరలు 30 శాతం పెరిగినా ప్రభుత్వం ఇచ్చే రాయితీ పెరగకపోవడంతో ఆ భారమంతా రైతులపైనే పడుతోంది. భారం మోస్తున్నా.. సర్వీసు మంజూరు చేయడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# దేవాలయ భూములు కబ్జా..

సూర్యాపేట : అధికారులు, పాలకులు ఒక్కటయ్యారు. ఏకంగా దేవుడి భూములకు ఎసరు పెట్టారు. ఏళ్లతరబడి ఆక్రమిత దారుల కబంధహస్తాల్లో వేలాది ఎకరాలు బంది అయ్యాయి. నల్గొండలో పార్కునే ఏర్పాటు చేయగా.. చాలా చోట్లా సాగు చేసుకుంటున్నారు. నిబంధనలు అతిక్రమించినా కబ్జాదారులను ప్రశ్నించేవారే లేకపోవడంతో వాళ్లదే ఇష్టారాజ్యంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 1450కి పైగా దేవాలయాలున్నాయి. ప్రభుత్వం గుర్తించిన 800 దేవాలయాలలో 505 దేవాలయాలకు 14650 ఎకరాల భూములున్నట్లు ఆ శాఖ అధికారులు గుర్తించారు. వీటిలో సుమారు మూడు వేల ఎకరాలను దేవాదాయశాఖ అధికారులు రైతులకు కౌలుకు ఇచ్చారు. దాదాపు 5 వేల ఎకరాలకు పైగా భూములు ఆక్రమణలో ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. మూడు వేల ఎకరాలకు పైగా భూములు సాగుకు యోగ్యం కానివి ఉన్నాయని వాళ్ల రికార్డుల్లో నమోదయ్యాయి. దేవుడి పేరుతో పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకోవడం, ఆలయ భూముల గుర్తింపుకోసం అధికారిని నియమించారు. సిబ్బంది కొరతతో సర్వే పని ముందుకు సాగడంలేదు. అనేక ఆలయాలకు చెందిన భూమి ఎక్కడ ఉ ందన్న విషయం ఇప్పటికీ సంబంధిత అధికారులకు తెలయట్లేదు. కళ్ల ముందు కనిపిస్తున్న భూములను సైతం స్వాధీనం చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. నల్గొండ మండలం అన్నెపర్తి గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయానికి చెందిన 13 ఎకరాల భూమి చర్లపల్లి సమీపంలో ఉంది. ఇటీవల నల్గొండ పురపాలిక అధికారులు అందులో పార్కు నిర్మించారు. దేవాలయ భూమిలో పార్కు ఏర్పాటు చేసినందుకు కనీసం లీజు ధర కూడా చెల్లించలేదు. గతంలో ఇదే భూమిని కొందరు ఆక్రమించి విక్రయించగా.. భక్తులు పోరాడి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. తాజాగా అదే భూమిలో పార్కు ఏర్పాటు చేయడంతో భక్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ భూమికి పరిహారం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వం సూచించిన విధంగా దేవాలయానికి లీజు మున్సిపాలిటివారు చెల్లిస్తారని కలెక్టర్ చెప్పారు. అయినా.. దస్త్రం ముందుకు కదల్లేదు.పానగల్ వేంకటేశ్వరస్వామి దేవాయాలని చెందిన 34.33 ఎకరాలను కొందరు రైతులు ఆక్రమించుకుని సాగుచేస్తున్నారు. స్వాధీనం చేసుకునేందుకు స్థానికులు ప్రయత్నించారు. ఆ భూములు తమవే నంటూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎండోమెంట్ ట్రైబ్యునల్ విచారించి ఆ భూమి ఆలయానిదేనంటూ తీర్పు ఇచ్చింది. అయినా.. అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ముందుకు రావడంలేదని భక్తులు వాపోతున్నారు. చందంపేట మండలం చిత్రియాలలోని మహంకాళి దేవాలయానికి సుమారు 200 ఎకరాలకు పైగా దేవాలయ భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదైంది. కానీ.. ఆ భూమి ఎక్కడ ఉందో అధికారులు గుర్తించకపోవడం వారి పనితీరుకు అడ్డం పడుతుంది.



## అయోధ్య శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి చంద్రబాబుకు ఆహ్వానం

అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారతదేశం సగర్వంగా హిందుత్వాన్ని చాటేలా, అత్యంత చారిత్రాత్మక కట్టడం గా నిర్మించిన 2500 సంవత్సరాల పాటు ప్రకృతి విపత్తులను తట్టుకొని నిలబడేలా నిర్మిస్తున్న అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి, రామ్ లల్లా విగ్రహాల ప్రాణ ప్రతిష్టకు సమయం ఆసన్నం అవుతోంది. దేశవ్యాప్తంగా ప్రజలు అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి అయోధ్యకు వెళ్లాలని ప్రయత్నాలు సాగిస్తున్నారు. దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులు, ప్రత్యేక రైళ్ళు కూడా ఏర్పాటు చేసి భక్తులను అయోధ్యకు చేర్చనున్నారు. అయోధ్యలో రామయ్యకు జరిగే పట్టాభిషేకాన్ని చూడాలని ఆ మహత్కార్యాన్ని కళ్ళారా చూసి తరించాలని ప్రతి ఒక్కరు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయోధ్య రామ మందిర నిర్మాణం కోసం దశాబ్దాలుగా నిరీక్షిస్తున్న వారందరి కోరిక తీరుతున్న సమయంలో రామయ్య తాను పుట్టిన నేలమీద తిరిగి నడయాడబోతున్నాడు. ఇదే సమయంలో దేశ, విదేశాలలోని ప్రముఖులకు రామ మందిర ప్రారంభోత్సవ ఆహ్వానాలను పంపిస్తున్నారు రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్వాహకులు, విశ్వహిందూ పరిషత్ నిర్వాహకులు. ఇప్పటికే అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం మరియు శ్రీరామ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తో పాటు పలువురు ఏపీ నేతలకు ఆహ్వానం అందింది. సినీ నటుడు చిరంజీవికి, మోహన్ బాబు తదితరులకు కూడా ఆహ్వానాలు అందాయి. ఈనెల 22వ తేదీన అత్యంత వైభవోపేతంగా అయోధ్యలోని రామ మందిరంలో శ్రీ రామ్ లల్ల విగ్రహ ప్రతిష్టాపన జరగనుంది. విగ్రహ ప్రతిష్టాపనకు నిన్నటి నుండి సాంప్రదాయబద్ధమైన ముందస్తు క్రతువులు ప్రారంభమయ్యాయి. 22వ తేదీన జరగనున్న ఈ చారిత్రాత్మక ఘట్టానికి 150 దేశాల నుంచి నాలుగు వేల మంది ప్రముఖులు అతిథులుగా హాజరుకానున్నారు. తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబుకు కూడా అయోధ్య రామాలయంలో శ్రీరామ ప్రతిష్ట కార్యక్రమానికి ఆహ్వానం అందింది. అక్కడకు వెళ్ళే అతిథుల కోసం కూడా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నారు. టెంట్ హౌస్ లను నిర్మించి వారికి కావాల్సిన వసతి సౌకర్యం కల్పించే పనిలో ఉన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు ఐపీఎస్‌ల కేటాయింపు




ఢిల్లీ : తెలుగు రాష్ట్రాలకు కొత్త ఐపీఎస్ అధికారుల్ని కేటాయిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు ముగ్గురు.. తెలంగాణకు ఆరుగురిని కేటాయించింది. ఈ అధికారులంతా 2022 బ్యాచ్‌కు చెందిన వాళ్లు. తెలంగాణకు అయేషా ఫాతిమా, మంధారే సోహం సునీల్, సాయి కిరణ్, మనన్ భట్, రాహుల్ కాంత్, రుత్విక్ సాయిని కేటాయించారు.

ఇటీవల ఢిల్లీ పర్యటనలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి అదనంగా ఐపీఎస్ అధికారులను కేటాయించాలని విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన అధికారుల పేర్లపై స్పష్టత రావాల్సి ఉంది.




## మరణాల రేటు 100 శాతమట..!

బీజింగ్: ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి పుట్టుక రహస్యం ఇప్పటికీ వీడనేలేదు. ఈ వైరస్‌ను చైనానే సృష్టించిందని, దాన్ని ప్రపంచదేశాలపై జీవాయుధంగా ప్రయోగించాలని భావించిందనే విశ్లేషణలు వ్యక్తమయ్యాయి. డ్రాగన్ మాత్రం వీటిని ఎప్పటికప్పుడు కొట్టిపారేస్తూనే ఉంది. ఏదేమైనా కొవిడ్ భయాల నుంచి ఇప్పుడిప్పుడే ప్రపంచం కుదుటపడుతోంది. ఈ క్రమంలోనే మరో ఆందోళనకర విషయం వెలుగులోకి వచ్చింది. కరోనా జాతికి చెందిన మరో ప్రమాదకర వైరస్‌పై బీజింగ్ ప్రయోగాలు చేస్తున్నట్లు అంతర్జాతీయంగా మీడియా కథనాలు వెలువడుతున్నాయి. దాని మరణాల రేటు 100 శాతంగా ఉన్నట్లు తెలుస్తోంది.దీ వుహాన్‌లో జరిపిన ఓ అధ్యయనంతో ఈ విషయం బయటపడినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఆ అధ్యయన వివరాల ప్రకారం.. SARS-CoV-2కు చెందిన GX_P2V అనే ఉపరకంపై చైనా శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తున్నారు. ఇది 2017లో వెలుగుచూసిన జీఎక్స్ ఉత్పరివర్తనంగా తెలుస్తోంది. గతంలో దీన్ని మలేషియన్ పాంగోలిన్స్ జంతువుల్లో గుర్తించారు. GX_P2V మ్యుటేటెడ్ వెర్షన్‌ను శాస్త్రవేత్తలు ఎలుకలపై ప్రయోగించారట. వాటిపై ఈ వైరస్ తీవ్ర ప్రభావం చూపించిందని, ఎనిమిది రోజుల్లోనే ఎలుకలన్నీ మరణించాయని అధ్యయనం వెల్లడించింది. దీని కారణంగా ఎలుకల ఊపిరితిత్తులు, ఎముకలు, కళ్లు, మెదడు దెబ్బతిన్నాయని తెలిపింది. బరువు తగ్గి బలహీనంగా మారాయని, కొన్ని రోజుల్లోనే కనీసం నడవలేని స్థితికి వాటి ఆరోగ్యం క్షీణించినట్లు తెలుస్తోంది. ఈ వైరస్ చాలా ప్రమాదకరమైందని అధ్యయనం పేర్కొంది. ఇది మనుషులపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందనే దానిపై స్పష్టత లేనప్పటికీ.. దాదాపు ఇలాంటి లక్షణాలే ఉండొచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ªªGX_P2V వైరస్‌తో మనుషులకు పెను ముప్పు వాటిల్లనుందని అర్థమవుతోంది" అని అధ్యయనకారులు పేర్కొన్నారు. దీంతో డ్రాగన్ ప్రయోగాలు ప్రపంచాన్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి. కాగా.. తాజా ప్రయోగాలతో వుహాన్ ల్యాబ్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలుస్తోంది. ఇక్కడి నుంచే కరోనా వైరస్ లీక్ అయ్యిందనే ఆరోపణలున్న విషయం తెలిసిందే.




ఒట్టావా: దౌత్యపరమైన విభేదాల నేపథ్యంలో భారతీయ విద్యార్థులకు ఇచ్చే స్టడీ పర్మిట్ల సంఖ్యను కెనడా గణనీయంగా తగ్గించింది. గత ఏడాది డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కేవలం 14,910 పర్మిట్లను మాత్రమే జారీ చేసింది. అంతక్రితం మూడు నెలల వ్యవధిలో ఈ సంఖ్య 1,08,940గా ఉంది. దాదాపు 86 శాతం తగ్గుదల నమోదైంది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు భారతీయ ఏజెంట్లే కారణమంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన నిరాధార ఆరోపణలు ఇరు దేశాల మధ్య తీవ్ర విభేదాలను రాజేసిన విషయం తెలిసిందే. దీంతో దిల్లీలోని తమ రాయబారులను భారీ సంఖ్యలో తగ్గించుకోవాలన్న భారత ప్రభుత్వ సూచన మేరకు కెనడా 41 మంది దౌత్యాధికారులను వెనక్కి తీసుకుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో స్టడీ పర్మిట్లను ప్రాసెస్ చేయడం కుదరడం లేదని ఆ దేశ ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. సమీప భవిష్యత్తులో పర్మిట్ల జారీ గణనీయంగా పెరిగే సంకేతాలూ కనిపించడం లేదని పేర్కొన్నారు. కెనడాలో విద్యనభ్యసించడానికి వెళ్లే విదేశీ విద్యార్థుల్లో భారతీయులదే సింహభాగం. 2022లో 2,25,835 స్టడీ పర్మిట్లు జారీ చేయగా.. అందులో 41 శాతం భారతీయ విద్యార్థులే సొంతం చేసుకున్నారు. అక్కడి విశ్వవిద్యాలయాలకు విదేశీ విద్యార్థులే ప్రధాన ఆదాయ వనరు. మరోవైపు విదేశీ విద్యార్థుల వలసలు గణనీయంగా పెరిగాయని.. దీంతో కెనడాలో నిరుద్యోగం, ఇళ్ల కొరత సమస్యలు తలెత్తుతున్నాయని ఇటీవల మిల్లర్ ఓ సందర్భంలో అన్నారు.

ఈ నేపథ్యంలో తమ దేశంలో నివాసముంటున్న విదేశీ విద్యార్థులపై పరిమితి విధించే యోచనలో ఉన్నామని తెలిపారు.




అమరావతి: విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలోని చిట్టెంపాడుకు చెందిన మాదల గంగులు ఎదుర్కొన్న హృదయవిదారక సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. రాష్ట్రంలో అంపశయ్యపైకి చేరిన వైద్య, ఆరోగ్యరంగ పరిస్థితులకు, గిరిజనుల కష్టాలను ఇది కళ్లకు కడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అసమర్థుడి పాలనలో గిరిజన బిడ్డలకు సరైన వైద్యం అందించడం ఎలాగూ చేతకాలేదని, కనీసం మృతదేహాన్ని తరలించేందుకు కూడా ఏర్పాట్లు చేయలేరా?అని ప్రశ్నించారు. ఫోన్ కొట్టిన వెంటనే 'కుయ్.. కుయ్..' అంటూ అంబులెన్స్ పరుగెత్తుకొస్తుందని గాలికబుర్లు చెప్పే ముఖ్యమంత్రి దీనికి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు.

**అసలేం జరిగిందంటే..? :** గ్రామానికి చెందిన మాదల గంగులుకు భార్య, ఆరు నెలల కుమారుడు ఉన్నారు. ఈనెల 5న కుమారుడికి అనారోగ్యం చేయడంతో డోలీలో శృంగవరపుకోట ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే భార్య గంగమ్మ కూడా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతోంది. ఇద్దరినీ విజయనగరం సర్వజన ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాబు ఈ నెల 6వ తేదీన మృతి చెందాడు. తర్వాత గంగమ్మ (23) కూడా తీవ్ర అనారోగ్యం పాలవడంతో మూడు రోజుల క్రితం విశాఖ జిల్లా భీమిలి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా.. మంగళవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ చనిపోయింది. గంగులు తన భార్య మృతదేహాన్ని ఆటోలో తీసుకురావడానికి మాట్లాడారు.

డ్రైవరు ఎస్.కోట వరకు తీసుకొచ్చి అక్కడి నుంచి రానంటూ వెనక్కి వెళ్లిపోయాడు. విధిలేక బాధను దిగమింగుకుంటూ తన స్నేహితుల ద్విచక్ర వాహనం తీసుకొని తమ్ముడు సాయంతో భార్య మృతదేహాన్ని మధ్యలో కూర్చోబెట్టుకొని ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బొడ్డవర రైల్వేస్టేషను వరకు తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలీ కట్టి బంధువుల సాయంతో మోసుకుంటూ గ్రామానికి తరలించాడు.

## మేనిఫెస్టోకు కాంగ్రెస్ కసరత్తు.. సూచనలివ్వాలంటూ ప్రజలకు పిలుపు



దిల్లీ: ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ తీవ్రంగా యత్నిస్తోంది. పార్టీ మేనిఫెస్టోలో ఎలాంటి అంశాలు చేర్చాలనే విషయంపై కసరత్తు చేస్తోంది. దీని రూపకల్పనలో భాగస్వాములు కావాలంటూ ప్రజలకు పార్టీ పిలుపునిచ్చింది. మేనిఫెస్టోను రూపొందించేందుకు ఏర్పాటుచేసిన కమిటీకి కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం నేతృత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. కమిటీ సభ్యులు ప్రతి రాష్ట్రంలోని ప్రజలతో సంప్రదింపులు జరిపి సూచనలు సేకరిస్తారని ఆయన తెలిపారు. ఇది ప్రజల మేనిఫెస్టో అని అన్నారు. సూచనల కోసం ఈమెయిల్, ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు చిదంబరం వెల్లడించారు. వీటి ద్వారా దేశవ్యాప్తంగా వీలైనంత ఎక్కువమంది నుంచి సూచనలు స్వీకరిస్తామన్నారు. మేనిఫెస్టో కోసం awaazbharatki@inc.inకు సలహాలు ఇవ్వొచ్చు లేదా www.awaazbharatki.inలో నేరుగా అప్‌లోడ్ చేయవచ్చని పార్టీ తెలిపింది. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా స్పందించారు. "కాంగ్రెస్ కేవలం పార్టీ కాదు. ప్రజల గొంతుక. టాప్– డౌన్ విధాన రూపకల్పనను విశ్వసించదు. సామాన్యుల ఆకాంక్షలకు అనుగుణంగా వారి అభివృద్ధికి ఉపయోగపడే విధానాలను తీసుకువస్తుంది. మేనిఫెస్టో ఎలా ఉండాలో సూచనల ద్వారా తెలియజేయండి" అని పోస్టు పెట్టారు.

## నారా లోకేశ్‌ను కలిసిన భవకుమార్.. తెదేపాలో చేరనున్న వైకాపా నేత



విజయవాడ: విజయవాడ నగర వైకాపా పార్టీ అధ్యక్షుడు బొప్పన భవకుమార్ ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిశారు. ఆయనతో పాటు అనుచరులు వైకాపాను వీడేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వంగవీటి రాధా, కేశినేని శివనాథ్ (చిన్ని), గద్దె రామ్మోహన్ తదితర నేతలతో చర్చలు జరిపారు.

బుజ్జగించేందుకు దేవినేని అవినాష్..తదితర వైకాపా నేతలు రంగంలోకి దిగినప్పటికీ.. ఆ పార్టీలో తనకు అడుగడుగునా అవమానాలు ఎదురయ్యాయని, అక్కడ కొనసాగలేనని తేల్చి చెప్పారు. ఎలాంటి షరతులు లేకుండానే తెదేపాలో చేరనున్నట్టు తెలిసింది. 2019లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి వైకాపా తరఫున గద్దె రామ్మోహన్‌పై భవకుమార్ పోటీ చేసి ఓడిపోయారు.




## అందుకే ఏపీసీసీ పదవికి రాజీనామా చేశా..

హైదరాబాద్: సామాన్య కార్యకర్తగా ఉన్న తనను కాంగ్రెస్ పార్టీ ఏపీసీసీ స్థాయివరకు తీసుకువచ్చిందని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అన్నారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్‌సీలో తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన తర్వాత యువజన కాంగ్రెస్, నలుగురు పీసీసీ అధ్యక్షులవద్ద ప్రధాన కార్యదర్శిగా పని చేశానని, ఆల్ ఇండియా కాంగ్రెస్ సెక్రటరీగా పనిచేశానని, ప్రధానంగా దివంగత రాజశేఖర్ రెడ్డికి అనుంగశిష్యుడిగా పని చేసిన అవకాశం లభించిందని ఆయన అన్నారు. ఎమ్మెల్సీగా పని చేశానని, 23 నవంబర్, 2022న ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టానని రుద్రరాజు తెలిపారు. ఇప్పుడు రాష్ట్రంలో పార్టీ ప్రయోజనాలు ముఖ్యంగా భావించి పీసీసీ పదవికి రాజీనామా చేశానన్నారు. వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ అయితే ఏపీలో కాంగ్రెస్ లబ్ది చేకూరుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇదే విషయం కాంగ్రెస్ అధిష్టానంతో మాట్లాడినప్పుడు చెప్పానన్నారు. ఈ దేశానికి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలని వైఎస్ఆర్ కోరికని.. వైఎస్ తనయగా ఆ కోరికను తీర్చేందుకు.. కాంగ్రెస్‌లో పనిచేసేందుకు షర్మిల వస్తున్నారని, అందరం కలిసి పనిచేస్తామని అన్నారు. ఇక్కడ పార్టీ ప్రయోజనాలు ముఖ్యమని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం అందరం కలిసి సమిష్టిగా పని చేస్తామని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

కాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభజన జరిగిన తర్వాత పలువురు కాంగ్రెస్ కీలక నేతలు ఇతర పార్టీల్లోకి వెళ్లిపోవడంతో.. ఏపీలో కాంగ్రెస్ కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు వైఎస్ షర్మిల రాకతో కొత్త ఉత్సాహం వస్తుందని నేతలు అభిప్రాయపడుతున్నారు. దివంగత వైఎస్సార్ కుమార్తె కావడంతో ఆమె చేరిక కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చేలా కనిపిస్తోంది. ఇప్పటికే వైసీపీని వీడిన పలువురు నేతలు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. దీంతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని ఆ పార్టీ నేతలు ఆశిస్తున్నారు.

## టీడీపీ - జనసేన కూటమి ప్రభుత్వం రావడం పక్కా..



పశ్చిమగోదావరి : జిల్లాలోని భీమవరం మండలం రాయలం గ్రామంలో టీడీపీ, జనసేన నాయకులతో ఎంపీ రఘురామ కృష్ణంరాజు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో 135 నుంచి 155 సీట్లు నెగ్గి టీడీపీ – జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకురాలు షర్మిల కారణంగా వైసీపీ సంప్రదాయ ఓట్ల నుంచి ఐదు నుంచి ఏడు శాతం చీలిపోనున్నాయన్నారు. నిన్నటి సుప్రీంకోర్టులో 17ఏ తీర్పును వక్రీకరిస్తూ సొంత పేపర్లో అసత్య కథనాలు రాయించారని విమర్శించారు. కొత్త ప్రభుత్వంలోనే విచారణ జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు వైసీపీ పాలన పట్ల ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ఎన్నికల తేదీ ఎప్పుడు వస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. నాలుగు సంవత్సరాల తర్వాత సొంత నియోజకవర్గంలో పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని చెప్పుకొచ్చారు. పార్లమెంట్ సమావేశాలు అనంతరం నియోజవర్గంలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని ఎంపీ రఘురామ కృష్ణంరాజు వెల్లడించారు. కాగా... ఆత్మీయ సమావేశంలో ఆర్ఆర్ఆర్ ఫుల్ హ్యాపీ అనే టైటిల్ గల కేక్‌ను కట్ చేసి అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

# ఆకుపచ్చ కోకలో విశ్వక్ బ్యూటీ.. సంక్రాంతి సెలెబ్స్ ఇలా!

తెలుగు తెరపై పొడగరి హారోయిన్లలో నివేదా పేతురాజ్ ఒకరు. మంచి హైట్.. అందుకు తగ్గ పర్సనాలిటీతో పడగొట్టేస్తుంది. హైట్ వల్ల ఈ బ్యూటీ ఇటు మోడ్రన్ డ్రెస్ లో ఎంత అందంగా ఉ ంటుందో అటు చీరకట్టులోనూ అంతే అట్రాక్టివ్ గా ఉంటుంది. సాధారణంగా మీడియం హైటున్న హీరోయిన్లకు మాత్రమే ఎక్కువగా అవకాశాలు వస్తాయి. అంతకుమించి ఉంటే పొడగరి కథానాయకులతోనే జట్టు కట్టాలి. అందువల్లనే కాస్త హైటున్న హీరోయిన్లకు అవకాశాలు తక్కువగానే వస్తుంటాయి. అలా తనకు వచ్చిన అవకాశాలను నివేదా పేతురాజ్ సద్వినియోగం చేసుకుంటూ వెళుతోంది. ఇటీవలే విశ్వక్ సేన్ దాస్ కా ధమ్కీ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన నివేదా, తన గ్లామర్‌తో పాటు పర్ఫార్మెన్స్‌తో ఆడియెన్స్‌ను ఇంప్రెస్ చేసింది. మరోవైపు, సోషల్ మీడియాలో వరుస ఫొటో షూట్స్ తో సందడి చేస్తుంటుంది అమ్మడు. మోడ్రన్ ఔట్ ఫిట్స్ తోపాటు



చీరల్లో అందాలు ఆరబోస్తుంటుంది. తన లుక్స్ తో కుర్రకారు మతులు పోగుడుతోంది. తాజాగా సంక్రాంతి స్పెషల్ ఫొటోలను షేర్ చేసింది. ప్యారెట్ గ్రీన్ కలర్ శారీ, పింక్ బ్లౌజ్ తో దిగిన పిక్స్ ను పంచుకుంది. తన ఫ్యాన్స్ కు సంక్రాంతి విషెస్ చెప్పింది. ఈ సింపుల్ చీరలో నివేదా చాలా అందంగా ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మిసెస్ బ్యూటీ అంటూ ఆమె ఫొటోలను రీషేర్ చేస్తున్నారు. లైకుల వర్షం కురిపిస్తున్నారు. హ్యాపీ పొంగల్ నివేద బేబీ అంటూ కామెంట్స్ బాక్స్ ను ఫిల్ చేసేస్తున్నారు. ఆకు పచ్చకోక అదిరిపోయిందని చెబుతున్నారు. శ్రీ విష్ణు మెంటల్ మదిలో సినిమాతో తెలుగు వాళ్లకు హీరోయిన్?గా పరిచయమైంది నివేద. ఈ మూవీ తర్వాత బ్రోచెవారెవరురా, చిత్రలహరి, అల వైకుంఠపురములో సినిమాల్లో తళుక్కుమంది. రెడ్ మూవీలో పోలీస్? గా, విరాటపర్వంలో కీలక పాత్రతో అలరించిన గ్లామర్ బ్యూటీ.. విశ్వక్ సేన్?తో పాగల్, దాస్ కా ధమ్కీ సినిమాలతో ఆకట్టుకుంది. అలాగే బ్లడీ మేరీ, బూ చిత్రాలతో ఓటీటీల్లో కూడా ఎంట్రీ ఇచ్చింది.

## బెయిల్ రాగానే నాగిని డ్యాన్స్ ఆడిందిట

సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మృతి కేసులో ఇరుక్కున్న బాలీవుడ్ నటి రియా చక్రవర్తి ఇటీవల జైలు జీవితం నుండి బయటపడిన సంగతి తెలిసిందే. నెలరోజుల పాటు జైలు శిక్షను అనుభవించిన ఈ వివాదాస్పద నటి తన జైలు అనుభవం గురించి మాట్లాడింది. జైలులో ఉన్న కాలంలో అక్కడ తిండిని మ్యానేజ్ చేయడం .. అపరిశుభ్రమైన బాత్రూమ్ తో.. పరిమిత భత్యంతో జీవితాన్ని కొనసాగించడం సహా తాను ఎదుర్కొన్న కష్టాలను నిజాయితీగా వెల్లడించింది. జైలులో సవాళ్లతో కూడిన జీవితం గురించి ప్రతిదీ ఓపెనైంది. అంతే కాదు ఈ అనుభవానికి కృతజ్ఞతలు తెలిపింది. చేతన్ భగత్‌తో చాట్ షో, దీప్‌టాక్ విత్ చేతన్ భగత్ లో రియా మాట్లాడుతూ- నిబంధనల కారణంగా నేను 14 రోజుల పాటు ఏకాంత నిర్బంధంలో ఉండవలసి వచ్చింది. గదిలో నేను ఒక్కదానినే ఉన్నాను. భోజనం చేయాలనుకుంటున్నారా? అని అధికారులు నన్ను అడిగారు. నేను



చాలా ఆకలితో ఉన్నాను.. చాలా అలసిపోయాను.. నాకు ఏమి ఇస్తే అది తిన్నాను. మెనూలో రోటీ - క్యాప్సికమ్ ఉన్నాయి అని వెల్లడించింది. నీటిలో ఉడికించిన క్యాప్సికం మాత్రమేనని తెలిపింది. తన తోటి ఖైదీలతో సానుకూలంగా ఉండటానికి ప్రయత్నించడమే గాక.. ఆ సమయంలో తన మూలాన్ని కనుగొన్నట్లు రియా తెలిపింది. చాలా మంది ఖైదీలకు కుటుంబ సపోర్టు లేకపోవడం చూసినప్పుడు నేను చాలా కృతజ్ఞతతో ఉండడం మొదలుపెట్టాను. బెయిల్ వచ్చినా వారి వద్ద రూ. 5,000 లేదా రూ10,000 లేకపోవడం వల్ల బయటకు వెళ్లలేకపోయేవారు. కనీసం నాకు నా కుటుంబం, స్నేహితులు ఉ న్నారు.. అని తెలిపింది. నాకు న్యాయం జరుగుతుంది. బెయిల్ వస్తుంది. నేను ఏ తప్పూ చేయలేదు. నేను ఇక్కడ ఉన్నప్పుడు ఈ మహిళ(ఖైదీ)ల నుండి నేర్చుకోవలసింది చాలా ఉంది. నా నియంత్రణలో లేని వాటి గురించి నేను ఎందుకు సమయం వృథా చేస్తున్నాను? అని ఆలోచించానని తెలిపింది. జైళ్లలో టాయిలెట్ సౌకర్యాల గురించి రియా ప్రస్తావించింది. జైలులో ఉండటం చాలా కష్టతరమైన అంశాలలో టాయ్ లెట్ ఒకటి.. జైలులో టాయ్ లెట్ అంత పరిశుభ్రతతో ఉండదని రియా నాటి అనుభవాన్ని గుర్తుచేసుకుంది. ఖైదీగా మానసిక గాయం చాలా కష్టంగా ఉంటుంది.. దానికి అదనంగా శారీరక గాయం ప్రారంభమవుతుంది. గండా బాత్రూమ్ తో కర్ లుంగీని నిర్వహించాలి అని కూడా అంది. జైలులో క్యాంటీన్ ఉందని, ఖైదీలు తమ ఇళ్ల నుంచి మనీ ఆర్డర్ తీసుకునేందుకు అనుమతి ఉందని ఆమె వెల్లడించారు. రియాకు మనీ ఆర్డర్ రూ. నెలకు 5,000. ఆహారం తినే సమయం, పడుకునే సమయాలలో బ్రిటీషర్లు వదిలివేసిన వ్యవస్థ(విభజించి పాలించే)ను జైలు కూడా అనుసరిస్తుందని రియా తెలిపారు.




# విజయ్ కోసం రష్మిక ఎప్పుడు రెడీనే..!




హీరో హీరోయిన్ కాస్త క్లోజ్ గా ఉంటే చాలు వాళ్లిద్దరి మధ్య ఏదో రిలేషన్ ఉందని మీడియా కోడై కూస్తుంది. వాటిని నిజం చేస్తూ కొందరు వారి రిలేషన్ ని ఓపెన్ అయితే.. మీడియా మా గురించి రాసిందంత ట్రాషే అంటూ కొందరు సమాధానం ఇస్తారు. అయితే అటు మీడియా వార్తలకు రెస్పాండ్ అవ్వకుండా.. వాటిని నిజం కాకుండా వస్తున్న జోడీ విజయ్ దేవరకొండ రష్మిక. గీతా గోవిందంతో జత కట్టి హిట్ కాంబో అనిపించుకున్న ఈ జోడీ ఆ తర్వాత డియర్ కామ్రేడ్ కలిసి చేసినా అది వర్క్ అవుట్ కాలేదు. మళ్లీ ఇద్దరు కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నదు లేదు కానీ వీళ్లిద్దరి ఫ్రెండ్ షిప్ మాత్రం ఒక రేంజ్ లో కొనసాగుతుంది. విజయ్ దేవరకొండ ఎక్కడ ఉంటే రష్మిక అన్నట్టుగా పరిస్థితులు కనబడుతున్నాయి. ఇద్దరు కలిసి వెకేషన్ కి టూర్లు వెళ్లడం.. కలిసి ఫెస్టివల్స్ ని సెలబ్రేట్ చేసుకోవడం ఇలా అన్ని కలిసి చేస్తారు. కానీ మీడియా దృష్టిలో పడితే మాత్రం తూచ్ మేమిద్దరం మంచి స్నేహితులమే అంటారు. కెరీర్ పరంగా చూస్తే రష్మిక బాలీవుడ్ టాలీవుడ్ అనే విధంగా దూసుకెళు తుంటే విజయ్ దేవరకొండ ప్రస్తుతం రెండు ప్రాజెక్ట్ లతో బిజీగా ఉ న్నాడు. విజయ్ రష్మిక ఇద్దరిని మళ్లీ కలిసి తెర మీద చూడాలని ఫ్యాన్స్ ఆరాటపడుతున్నారు. కానీ ఆ ఛాన్స్ మాత్రం రావట్లేదు. విజయ్ ప్రస్తుతం చేస్తున్న ఫ్యామిలీ స్టార్ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తుండగా ఆ సినిమాలో రష్మిక ఒక స్పెషల్ సాంగ్ చేస్తుందని అన్నారు. కానీ తెలుస్తున్న విషయం ఏంటంటే విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్ లో రష్మిక సాంగ్ లేదన్నది తెలుస్తుంది. ఇక ఆ సినిమాలో స్పెషల్ సాంగ్ లేకపోయినా విజయ్ 12వ సినిమా గౌతం తిన్ననూరి సినిమాలో రష్మికతో స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. ఆర్మీ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో హీరోయిన్ గా ఏజెంట్ హీరోయిన్ సాక్షి వైద్యాని ఫిక్స్ చేశారు.

సినిమాలో అదనపు ఆకర్షణ కోసం రష్మిక మందన్న చేత స్పెషల్ సాంగ్ చేయించాలని ప్లాన్ చేస్తున్నారట. తప్పకుండా రష్మిక ఈ సినిమాకు భారీ హైప్ తీసుకురావడంలో సక్సెస్ అవుతుందని చెప్పొచ్చు. రష్మిక మందన్న విజయ్ కాంబో తెర మీద కనిపిస్తే చాలు అనుకుంటున్న ఫ్యాన్స్ కూడా ఉన్నారు. మరి ఈ స్పెషల్ సాంగ్ అప్డేట్ బయటకు రావాల్సి ఉంది.

# 2025 సంక్రాంతి.. మెగాస్టార్ తో పాటూ ఆ సినిమాలు కూడా?




టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర 2024 సంక్రాంతి సీజన్ లో సినిమాల మధ్య ఎలాంటి పోటీ నెలకొందో చూశాం. ఈ సంక్రాంతికి ఏకంగా నాలుగు సినిమాలు బాక్సాఫీస్ వద్ద పోటీ పడ్డాయి. ఇక వచ్చే సంక్రాంతి సీజన్లోనూ భారీ పోటీ ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి 2025 సంక్రాంతికి మొట్టమొదట బెర్త్ కన్ఫర్మ్ చేసుకున్నారు. బింబిసారా మూవీ ఫేమ్ శిష్ట దర్శకత్వంలో మెగాస్టార్ నటిస్తున్న '%వీవస్త్రు%156' విశ్వంభర ని 2025 సంక్రాంతికి రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమాతో పాటు వచ్చే సంక్రాంతి బరిలో మరికొన్ని సినిమాలు నిలవనున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాత దిల్ రాజు బ్యానర్ లో 2017 లో వచ్చిన 'శతమానంభవతి' సినిమా ఎలాంటి సక్సెస్ ని అందుకుందో తెలిసిందే. సతీష్ వేగేశ్న దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శర్వానంద్ అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించారు. కుటుంబ బంధాలను ఎంతో ఎమోషనల్ గా చూపించిన ఈ సినిమా ఆడియన్స్ నుంచి అనూహ్య స్పందన అందుకోవడంతోపాటు ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డును కూడా గెలుచుకుంది. 2017 సంక్రాంతి సీజన్ లోనే ఈ సినిమా రిలీజ్ అయింది. ఆ సమయంలో చిరంజీవి ఖైదీ నెంబర్ 150, బాలయ్య గౌతమీపుత్ర శాతకర్ణి వంటి పెద్ద సినిమాలు కూడా రిలీజ్ కాగా వాటితో పోటీపడి సంక్రాంతి బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇక ఇప్పుడు ఈ సినిమాకి సీక్వెల్ కూడా రాబోతోంది. ఈరోజు సంక్రాంతి కానుకగా సీక్వెల్ ని అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. 'శతమానంభవతి నెక్స్ట్ పేజీ' అనే టైటిల్ తో పోస్టర్ విడుదల చేస్తూ ఈ చిత్రాన్ని 2025 సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సినిమాతో పాటు ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి తెరకెక్కనున్న రెండో మూవీ అదే హనుమాన్ సీక్వెల్ 'జై హనుమాన్' కూడా 2025 సంక్రాంతికి రిలీజ్ కానుంది. అటు కింగ్ నాగార్జున 'బంగార్రాజు పార్ట్-3' ని కూడా సంక్రాంతికి రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇవే కాకుండా మరికొన్ని సినిమాలు వచ్చే సంక్రాంతి రేసులో జాయిన్ కానున్నట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి వచ్చే సంక్రాంతికి కూడా టాలీవుడ్ లో సినిమా పండగ ఓ రేంజ్ లో ఉంటుందని చెప్పొచ్చు.

# 360 డిగ్రీల్లో తిప్పేస్తున్నావ్ గా అమ్మడు!

మరాఠీ అందం మృణాల్ బ్యూటీ ని వర్ణించడమేలా! అమ్మడి బ్యూటీకి ఫిదా కానిది ఎవరు? మృణాల్ బ్యూటీకి లాక్ అవ్వాలంటే అందమైన నవ్వు ఒకటి చాలదా! అంతకు మించి చేస్తే ఆ బ్యూటీ దాడిని తట్టు కోగలమా? అవును ఈ వీడియో చూసిన తర్వాత ఈ సందేహం రాకమానదు. అమ్మడు ఈ వీడియోలో అంత అందంగా ముస్తాబై కవ్వించేస్తుంది మరి. పువ్వల డిజైనర్ ఔట్ ఫిట్ లో మృణాల్ బ్యూటిని వర్ణించాలంటే ఆ కవులే దిగిరావాలి. ఈ ఫొటో షూట్ లో అంత అందంగా కనిపిస్తుంది. మృణాల్ ముస్తాబైన విధానం...కొంటె చూపులు...కళ్లకు అద్దిన ఐటెక్స్..గాలికి విరబూసిన ఆ కురులు..వాటిని చేతులతో అలా నెరుముతూ కెమెరా వైపు చూస్తూ ఇచ్చిన ఫోజులకు ఫిదా కావాల్సిందే. కుర్రాళ్లంతా రౌండ్ ది క్లాక్ 360 డిగ్రీలు తిరగాల్సిందే. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. కామెంట్ బాక్సులో మృణాల్ బ్యూటీని ఉద్దేశించి అదే తీరున కామెంట్లు



కనిపిస్తున్నాయి. డిజైనర్ దుస్తుల ఎంపికలో మృణాల్ మాత్రం సంథింగ్ స్పెషల్ అనే అనాలి. మిగతా భామలకు కొంచెం భిన్నమైన దుస్తులు..భంగిమలతో ఆకట్టుకుంటుంది. ఎక్కువగా పువ్వుల డిజైన్స్ ఎంపిక చేసుకోవడం అమ్మడి ప్రత్యేకత. వాటిలో మరింత అందంగా కనిపిస్తుంది. వాటిలో ఆ బ్యూటీని ఆ స్వాదించే వారికే ఆ కిక్ దొరుకుతుందన్నది అభిమానుల మాట. ఇక మృణాల్ కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. పట్టిందల్లా బంగారమే అవుతుంది. 'సీతారామం' తర్వాత రిలీజ్ అయిన రెండవ సినిమా 'హాయ్ నాన్న'తో మంచి విజయం దక్కించుకున్న సంగతి తెలిసిందే. సినిమా కమిట్ మెంట్లు...రిలీజ్ లు ఆలస్యమైనా హిట్ కంటెంట్ తోనే ప్రేక్షకుల ముందుకొస్తుంది. తళుకు బెళుకు రాళ్లు తట్టడేలా..నిక్కమైన నీలమొక్కటి చాలు అంటూ ముందుకు సాగుతుంది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన 'ఫ్యామిలీ స్టార్' లో నటిస్తోన్న సంగతి తెలిసిందే.

## అమీర్ కూతురి విందులో మృణాల్ హొయలు

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగిన సాంప్రదాయ క్రైస్తవ వేడుకలో పెళ్లి చేసుకున్న తర్వాత అమీర్ ఖాన్ కుమార్తె ఇరా ఖాన్ - నుపుర్ శిఖరే పెళ్లి రిసెప్షన్‌ను నిర్వహించారు. నవ వధువు తండ్రి నటుడు, అమీర్ ఖాన్ ఈ వేడుకలను భారీగా ప్లాన్ చేసారు. ఖాన్- నూపూర్ శిఖరే వెడ్డింగ్ రిసెప్షన్ లో అతిథుల హంగామాకు సంబంధించిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఐరా ఎరుపు రంగు లెహంగాలో కొద్దిపాటి ఆభరణాలు స్మోకీ మేకప్ లుక్‌తో అందంగా కనిపించింది. నుపుర్ తన రిసెప్షన్‌కు నల్లటి షేర్వాణీని ధరించాడు. ఇరా ఖాన్ - నుపుర్ శిఖరే జనవరి 3 న ముంబైలో రిజిస్టర్ మ్యారేజ్ ద్వారా తమ సంబంధాన్ని అధికారికం చేసుకున్నారు. నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో జరిగిన రిసెప్షన్ లో చాలా మంది స్టార్లు కనిపించగా, ఇందులో అందాల కథానాయిక మృణాల్ ఠాకూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మృణాల్ ఎప్పటిలానే ఈ ఈవెంట్ కి



చాలా సింపుల్ లుక్ తో హాజరైనా కానీ, తనదైన అందమైన చిరునవ్వు బ్రిలియన్సీతో కట్టి పడేసింది. అందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు యువతరంలో వైరల్ గా మారుతోంది. ఇక మృణాల్ ఈవెంట్ కి చేరుకోగానే ఫోటోగ్రాఫర్లు తనపై ఫ్లాష్ లతో విరుచుకుపడ్డారు. మృణాల్ దక్షిణాదిన పెద్ద స్టార్. ఇప్పుడు హిందీ పరిశ్రమలోను ఓ వెలుగు వెలిగేందుకు తనవైన ప్రణాళికలను కలిగి ఉంది. ఈవెంట్లో ఇరా- నూపుర్ జంట రొమాంటిక్ ఫోజ్ కూడా అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. అమీర్ ఖాన్ - అతని మాజీ భార్య రీనా దత్తా కు మార్తె అయిన ఇరా ఖాన్ కి ఇది ఎంతో గొప్ప ఆనందక్షణం. ఈ పార్టీకి బాలీవుడ్ మొత్తం తరలివచ్చింది. ఇరా ముంబై రిసెప్షన్‌కు సినీ పరిశ్రమకు చెందిన అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు. షారుఖ్ ఖాన్, గౌరీ ఖాన్, సల్మాన్ ఖాన్, అనిల్ కపూర్, నాగ చైతన్య తదితర ప్రముఖులు ఈ పార్టీకి హాజరయ్యారు. షోబిజ్ నుండి పెద్ద స్టార్లతో పాటు, క్రీడారంగం, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ వేడుకకు విచ్చేసి నవదంపతులను ఆశీర్వదించారు. ఈ వివాహ రిసెప్షన్‌లో మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కూడా పాల్గొన్నారు.



# దావోస్‌లో పలువురు పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ భేటీ



హైదరాబాద్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మూడోరోజు పర్యటన కొనసాగుతోంది.

'ప్రపంచ ఆర్థిక వేదిక' సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం.. బుధవారం పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతం అదానీ, టాటాసన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో ఆయన సమావేశమయ్యారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్, గ్లోబల్ హెల్త్ స్ట్రాటజీ వైస్ ప్రెసిడెంట్ విలియం వార్, వీఆర్‌ఎల్‌డీసీ ప్రతినిధులను కలిశారు.
రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. రేవంత్ వెంట మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు ఉన్నారు.

# నాడు, నేడు, ఏనాడైనా.. తెలంగాణ గళం, దళం మేమే: కేటీఆర్



హైదరాబాద్: పార్లమెంట్‌లో తెలంగాణ వాణి బలంగా వినిపించాలంటే సార్వత్రిక ఎన్నికల్లో భారాసకు ఓటు వేయాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్ టీమ్‌కు ఎందుకు ఓటు వేయాలో 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు. 16, 17 లోక్‌సభల్లో భారాస ఎంపీలు మొత్తం 4,754 ప్రశ్నలు అడిగితే.. కాంగ్రెస్ 1,271, భాజపా 190 ప్రశ్నలు మాత్రమే అడిగారని చెప్పారు. తెలంగాణ హక్కులు, ప్రయోజనాల కోసం కేంద్రాన్ని డిమాండ్ చేసేది భారాస ఎంపీలు మాత్రమేనన్నారు. "నాడు.. నేడు.. ఏనాడైనా.. తెలంగాణ గళం.. బలం.. దళం.. మనమే"అని అన్నారు.




హైదరాబాద్: ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆలయాల స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా బషీర్‌బాగ్‌లోని కనకదుర్గమ్మ ఆలయాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శుభ్రం చేశారు. హిందువులు అందరూ ఈనెల 22న ఇళ్లు శుభ్రం చేసుకొని, దీపాలు వెలిగించాలని కోరారు. ఇది.. భారతావనిపై 500 ఏళ్ల తర్వాత అయోధ్య రామయ్యకు జరుగుతున్న పట్టాభిషేకం అని ఆయన పేర్కొన్నారు.

# తమ్మినేని వీరభద్రం చికిత్సకు స్పందిస్తున్నారు: ఏఐజీ ఆస్పత్రి

హైదరాబాద్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చికిత్సకు స్పందిస్తున్నట్లు ఏఐజీ ఆస్పత్రి తెలిపింది. ఈ మేరకు హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. తమ్మినేని బీపీ కంట్రోల్‌లోనే ఉందని.. ప్రస్తుతం ఆయన మాట్లాడగలుతున్నారని పేర్కొంది. రానున్న 48 గంటలు ముఖ్యమని, వివిధ విభాగాల వైద్యులు కలిసి ఆయనకు




చికిత్స అందిస్తున్నారని వెల్లడించింది. తమ్మినేని వీరభద్రం మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఖమ్మం గ్రామీణ మండలం తెల్దారుపల్లిలోని తన స్వగృహంలో ఉన్న ఆయన ఉదయం ఛాతీ నొప్పితోపాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు చేసి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఏఐజీకి తీసుకొచ్చారు.

# కొండలు తవ్వి విల్లాలకు రోడ్ల నిర్మాణంపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 17: నగరంలోని ఖాజాగూడా బయోడైవర్సిటీ పార్కు పెద్ద చెరువు పక్కన ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్లు నిర్మిస్తున్న ఘటనపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. దీనికి సంబంధించి పలు పత్రికల్లో వచ్చిన కథనంపై రోడ్లు భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్ల నిర్మాణం పనులు



ఆపించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ సెక్రటరీ, రంగారెడ్డి కలెక్టర్‌ను ఆదేశించారు. రోడ్ల నిర్మాణానికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో కీలక మంత్రి బామ్మర్దికి విల్లా ప్రాజెక్టుతో సంబంధాలు ఉన్నాయని.. అదే విల్లాలో మాజీ మంత్రి ఉ ంటున్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తే ఉపేక్షించేది లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజాభవన్ యాక్సిడెంట్ కేసులో కీలక మలుపు.. మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు షాక్

హైదరాబాద్: ప్రజాభవన్(పాత ప్రగతి భవన్) ముందు జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ పేరును పంజాగుట్ట పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. తన కొడుకు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్‌కు పారిపోయేందుకు షకీల్ సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. రోడ్డు ప్రమాద ఘటన తర్వాత.. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది ముంది సహాయం చేసినట్లు అనుమానిస్తున్నారు. అందులో ఇద్దరిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. ఇందులో షకీల్ కూడా తన కొడుకు కోసం సహకరించినట్లు గుర్తించారు. ఇక.. ఇప్పటికే సాహిల్ అలియాస్ రాహిల్‌పై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. అతన్ని దుబాయ్ నుంచి రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజా భవన్ ముందు సాహిల్ గత నెల 23వ తేదీన కారుతో బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. నిర్లక్ష్యపూరిత



డ్రైవింగ్‌తో ప్రజాభవన్ ఎదుట బారికేడ్లను తన కారుతో ఢీకొట్టాడు. ఘటన సమయంలో కారులో ఇద్దరు యువకులు, ముగ్గురు యువతులు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఇక.. కారు ప్రమాద విజువల్స్ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వాటి ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిపైనా వేటు వేశారు.

# అప్పట్లో పేపర్ బాయ్.. ఇప్పుడు ఎమ్మెల్యే.. అయినా ఇందిరమ్మ ఇంట్లోనే



హైదరాబాద్ : ఎమ్మెల్యే దాకా ఎందుకు సర్పంచ్ గా గెలిస్తేనే.. ఫార్చ్యూనర్ లో తిరిగే పరిస్థితి. అందుకు భిన్నంగా అలాంటి ఆర్భాటాలు ఏమీ లేకుండా సింపుల్ గా ఉండటం.. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంట్లో ఉండటం లాంటివి ఊహించగలమా? అది కూడా తెలుగు రాష్ట్రాల్లో.. అంటే లేదనే చెబుతారు. కానీ.. అలాంటి తీరునే ప్రదర్శిస్తున్నారు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు. తాజాగా ఆయన తన ప్రస్థానాన్ని వివరించిన తీరు చూసినప్పుడు.. ఈ రోజుల్లోనూ ఇలాంటి వారు ఉన్నారా? అన్న భావన కలుగక మానదు. తాను ఎమ్మెల్యేగా ఎన్నిక కావటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కారణమన్న బొజ్జు.. తాను డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఒక దినపత్రిక పేపర్ బాయ్ గా పని చేశానని చెప్పారు. తన ప్రయాణం గురించి చెబుతూ.. "2006లో డిగ్రీ పూర్తైంది. మా తాత గేదెను అమ్మి సైకిల్ కొనిచ్చాడు. దీంతో అదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఈనాడు పేపర్ బాయ్ గా చేరాను. ఆ తర్వాత మరో పత్రికలో జర్నలిస్టుగా పని చేశాను. ఎమ్మెల్యే అయినప్పటికీ గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంట్లోనే ఉంటున్నా. నిరాడంబరంగా జీవిస్తూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తా' అని చెప్పుకొచ్చారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎమ్మెల్యే అన్నంతనే హంగు.. అర్భాటాలకు భిన్నంగా సింపుల్ గా ఉన్న ఖానాపూర్ ఎమ్మెల్యే తీరు ఆసక్తికరంగా మారింది. సొంత శక్తితో ఎదిగిన అతడి తీరును పలువురు అభినందిస్తున్నారు. ఏమైనా.. ఇప్పుడున్న రాజకీయాల్లోకి ఈ తరహా నేతలు పెద్ద ఎత్తున వస్తే తప్పించి.. ధనబలం నుంచి రాజకీయాలు బయటకు వచ్చే అవకాశం లేదని చెప్పాలి.

# కేటీయార్ వైరాగ్యం పీక్స్ కి...!

హైదరాబాద్ : కేటీఆర్ సన్ ఆఫ్ కేసీఆర్.అంతేనా కానే కాదు కేటీఆర్ బీఆర్ఎస్ కి కీలకం, దాదాపుగా పదేళ్ల పాటు తెలంగాణాలో సాగిన గులాబీ పార్టీ ప్రభుత్వానికి అన్నీ ఆయనే అయ్యారు. ఒక విధంగా ఫుల్ పవర్స్ తో అటు పార్టీని ఇటు ప్రభుత్వాన్ని నడిపించారు. అయితే అనూహ్యంగా ఓటమి వరించింది. దాంతో కేటీఆర్ ఒక్కసారిగా మారిపోయారు. ఆయన నోటి వెంట వేదాంతం అలా తన్నుకుని వస్తోంది. కేటీఆర్ ఇటీవల కాలంలో ఏమి మాట్లాడినా వైరాగ్యమే అందులో కనిపిస్తోంది. లేటెస్ట్ గా కేటీఆర్ ఆణిముత్యాల లాంటి మాటలను బీఆర్ఎస్ క్యాడర్ కి చెప్పుకొచ్చారు. అదేంటి అంటే పదవులు వస్తాయి పోతాయి పదవులు శాశ్వతం కాదు అని. నిజమే కదా ఇవి కదా అండర్ లైన్ చేసుకుని మరీ పదే పదే రాజకీయ నేతలు చెప్పుకోవాల్సింది. అంతే కాదు మరో మంచి మాట కూడా కేటీఆర్ అన్నారు. పదవిలో ఉన్నప్పుడు ఎంత మంచిగా పనిచేశారన్నదే ముఖ్యమని. సిరిసిల్ల నియోజకవర్గంలోని సర్పంచ్‌లు విజయవంతంగా అయిదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో సర్పంచ్‌ల ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ పదవుల గురించి అలా తన మనసులో మాటలను చెప్పేశారు. పదవులు వస్తాయి పోతాయి అంటూ ఇటీవల బీఆర్ ఎస్ కి తగిలిన భారీ ఓటమిని మరచిపోయే ప్రయత్నం చేసారు. తనను తాను ఓదార్చుకుంటూ క్యాడర్ ని కూడా ఉత్సాహపరచారు అన్న మాట. అదే విధంగా లైఫ్ గురించి కూడా కొన్ని మాటలు చెప్పారు. జీవితంలో, రాజకీయాల్లో ఎదురుదెబ్బలు



సహజమన్నారు. గోడకు తగిలిన రబ్బర్ అదే తరహాలో మళ్లీ తప్పకుండా తిరిగి వస్తామన్నారు. మొత్తానికి చూస్తే కేటీఆర్ లో ఈ ఆశావహ దృక్పథానికి మాత్రం హాట్సాఫ్ అనాల్సిందే. ఎందుకంటే నేతాశ్రీలు ఓడిపోతే మాత్రం ప్రపంచం తల్లకిందులు అయింది అని భావిస్తారు. కానీ కేటీఆర్ మాత్రం వేదాంతాన్ని వల్లిస్తూ అందులోనే శాంతిని చూసుకుంటున్నారు. ఉందిలే మంచి కాలం ముందు ముందునా అని క్యాడర్ కి ధైర్యం నూరిపోస్తున్నారు. అయితే కేటీఆర్ మాటలు అన్నీ మరో రెండు మూడు నెలలలో జరిగే ఎంపీ సీట్ల మీద ప్రభావం చూపించి బీఆర్ ఎస్ ఎక్కువ ఎంపీ సీట్లు దక్కించుకుంటే ఓకే. లేకపోతే మాత్రం అపుడు ఈ రాజకీయ వేదాంతం మరో అయిదేళ్లకు సరిపడా దగ్గరలో ఉంచుకుని టన్నుల కొద్దీ ధైర్యం తెచ్చుకోవాల్సిందే అని కాంగ్రెస్ నేతలు సెటైర్లు వేస్తున్నారు.

# రాజేందర్ ఈటల రూటు మారింది!



హైదరాబాద్ : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన రెండు చోట్లా పరాజయం పాలైన తెలంగాణ బీజేపీ కీలక నేత ఈటల రాజేందర్.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అయినా సత్తా చాటాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా నిన్నమొన్నటివరకూ ఆయన మల్కాజ్ గిరీ లోక్ సభ స్థానంనుంచి పోటీచేస్తారని కథనాలొచ్చిన వేళ... తాజాగా ఆయన రూటు మారిందని తెలుస్తుంది. ఈ మేరకు ఆ విషయాన్ని ఈటల తాజాగా వెల్లడించారు. అవును... పార్లమెంట్ ఎన్నికల బరిలో బీజేపీ నుంచి ఈటల రాజేందర్ మల్కాజ్ గిరి నుంచి పోటీ అంటూ ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో ఆయన పార్టీ మారబోతున్నారని, కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుని మరోచోటు నుంచి ఎంపీగా పోటీ చేస్తారంటూ ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై స్పందించిన ఆయన... కాంగ్రెస్ చేరడం లేదని చెబుతున్నప్పటికీ ప్రచారం మాత్రం ఆగడంలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఈటల ఈ విషయంపై స్పందించారు. హనుమకొండ జిల్లాలోని కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరైన సందర్భంగా ఈటల ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... అధిష్టానం ఆదేశిస్తే... కరీంనగర్ నుంచి ఎంపీగా బరిలోకి దిగేందుకు సిద్ధమని అన్నారు. దీంతో... ఈటల మనసు మల్కాజిగిరీ నుంచి కరీంనగర్ కు మారినట్లుందనే చర్చ రాజకీయవర్గాల్లో మొదలైంది. వాస్తవానికి కరీంనగర్ ఎంపీగా మరోసారి విజయఢంకా మోగించాలని బీజేపీ నేత బండి సంజయ్ తెగ కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా... బూత్ లెవల్ మీటింగ్స్ నిర్వహిస్తూ.. కార్యకర్తలతో ఓ భారీ సమావేశానికి బండి ఇప్పటికే స్కెచ్ వేశారని తెలుస్తుంది. అలా బండి సంజయ్ ప్రిపేర్ అయిపోతున్న చోట... అధిష్టాణం అవకాశమిస్తే తాను కరీంనగర్ నుంచి పోటీ చేస్తానని ఈటల చెప్పడం చర్చనీయాంశం అవుతుంది.

**కాంగ్రెస్ అభ్యర్థి అంటూ...!:** ఆ సంగతి అలా ఉంటే... మరోవైపు కరీంనగర్ స్థానంలో ఈటల రాజేందర్ కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో ఉండబోతున్నారనే ప్రచారం విపరీతంగా జరుగుతుంది! ఈటల మల్కాజిగిరి నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉంటారన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. మల్కాజ్ గిరి కంటే.. కరీంనగర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగితే కచ్చితంగా విజయం సాధించవచ్చని, మళ్లీ రాజకీయంగా స్ట్రాంగ్ కావచ్చని అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.



# ఆలయంలో నటుడి కుమార్తె వివాహం.. హాజరైన మోదీ

తిరువనంతపురం: మలయాళ నటుడు, భాజపా నేత సురేశ్ గోపి కుమార్తె వివాహానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. కేరళ పర్యటనలో ఉన్న ఆయన.. కొచ్చిలో రోడ్ షో చేపట్టిన అనంతరం త్రిస్సూర్ వచ్చారు. గురువాయూర్ ఆలయంలో కొత్త జంటను ఆశీర్వదించి వారిద్దరికీ వరమాలలు అందించారు. దీనికి సంబంధించిన దృశ్యాలు మీడియాలో దర్శనమిచ్చాయి. సురేశ్ గోపి కుటుంబం, కొత్త జంటతో మాట్లాడిన మోదీ.. వారితో ఫొటోలు తీసుకున్నారు. ఈ వేడుకలో మోహన్‌లాల్, మమ్ముట్టి, తదితర మలయాళ నటులు సందడి చేశారు. వారితోనూ ప్రధాని ముచ్చటించారు. అలాగే మరో 30 జంటలను ఆశీర్వదించారు. వధువు భాగ్య సురేశ్.. సురేశ్ గోపి పెద్ద కుమార్తె. ఇదిలా ఉండగా.. బుధవారం ఉదయం ప్రధాని గురువాయూర్‌లోని కృష్ణుడి ఆలయంలో పూజలు చేశారు. దానికి సంబంధించిన చిత్రాలను ఎక్స్‌లో షేర్ చేశారు. వాటిలో ఆయన సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. ప్రతి భారతీయుడి సుఖ సంతోషాల కోసం పూజలు చేసినట్లు వెల్లడించారు. ప్రధాని రాకతో ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రత కనిపించింది. హెలిప్యాడ్ వద్దకు భారీసంఖ్యలో మద్దతుదారులు రావడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా కనిపించింది. కొన్ని నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో.. మోదీ దక్షిణాది రాష్ట్రాలపై ప్రధానంగా దృష్టి సారించారు. నిన్న కొచ్చిలో రోడ్‌షో పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com